ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 1, ఏప్రిల్ 2025



భక్తిశ్రద్ధలతో రంజాన్

రంజాన్‌ను జిల్లావ్యాప్తంగా ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఒకరికొకరు ఈద్ ముబారక్ అంటూ పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. తగ్బీర్ చదువుతూ ఈద్గాల వద్దకు చేరుకుని సామూహిక నమాజ్‌లు చేశారు. అనంతరం పేదలకు దానధర్మాలు చేశారు. కొండపిలో జరిగిన ప్రార్థనల్లో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పాల్గొన్నారు.

- వివరాలు లోపలి పేజీల్లో.

నేడు టెన్త్ సోషల్ పరీక్ష యథాతథం

ఒంగోలు విద్య, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) పదో తరగతి విద్యార్థులకు సోషల్ పరీక్ష మంగళవారం యథాతథంగా జరుగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. రంజాన్ పండుగ సందర్భంగా మంగళవారం ఆప్షనల్ హాలిడేగా ప్రకటించినా



సరే పరీక్ష, కార్యాలయాలు కొనసాగుతాయని ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే పదో తరగతి మూల్యాంకనంలో భాగంగా జరుగుతున్న బార్ కోడింగ్, పాఠశాలలు మామూలుగానే నడుస్తాయి. ఇతర ప్రభుత్వ శాఖల్లోని ముస్లిం ఉద్యోగులు ఆప్షనల్ హాలిడేను వినియోగించుకోవచ్చు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సంబంధించి మంగళవారం పరీక్ష జరుగుతుందన్న సమాచారం విద్యార్థులకు, పరీక్షా కేంద్రాల చీఫ్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇన్విజిలేటర్లు, ఇతర ఉద్యోగులకు ఇచ్చి అందరూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్య ఆర్జేడీలు, డీఈవోలను ప్రభుత్వం ఆదేశించింది.



ఒంగోలులోని ఈద్గా వద్ద నమాజ్ చేస్తున్న ముస్లింలు (ఇన్‌సెట్‌లో) కొండపిలో ప్రార్థన చేస్తున్న మంత్రి స్వామి



17 మండలాల్లో కరువు

11 చోట్ల తీవ్ర, ఆరుచోట్ల ఒక మోస్తరు

రబీకి సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు

తాగునీరు, పశుగ్రాసానికి నిధులిచ్చే అవకాశం

ఒంగోలు మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రబీ సీజన్‌లో 17 మండలాల్లో కరువు నెలకొన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అందులో 11 మండలాల్లో తీవ్రస్థాయిలో ఉండగా మరో ఆరుచోట్ల ఒక మోస్తరు ఉన్నట్లు పేర్కొంది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. వర్షపాతం నమోదు, భూగర్భ జలమట్టాలు, పంటల సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనాతోపాటు వర్షాలు సకాలంలో కురిశాయా? లేదా? అన్న అంశాల ఆధారంగా ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించింది. రబీ సీజన్‌లో అక్టోబరు నుంచి డిసెంబరు వరకు ఈ అంశాల ఆధారంగా ఫిబ్రవరి ఆఖరులో నివేదికలను ప్రభుత్వం తీసుకుంది. ప్రస్తుత వేసవిలో పలు జిల్లాల్లో తాగునీరు, పశుగ్రాసం ఇతరత్రా సమస్యలను ఎదుర్కొనేందుకు కరువు ప్రాంతాల ప్రకటనతోపాటు నిధుల కల్పనను ఇటీవల నిర్వహించిన సమావేశంలో పలువురు కలెక్టర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. మన కలెక్టర్ కూడా 14 మండలాల్లోని 230 ఆవాసాలకు ట్యాంకర్లతో నీటి సరఫరాకు రూ.11.20 కోట్లు కోరారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆయా జిల్లాల నుంచి వచ్చిన నివేదికలను పరిశీలించి ఆరు జిల్లాల్లోని 51 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. అందులో మన జిల్లాకు సంబంధించే 17 మండలాలు ఉన్నాయి.

తీవ్ర కరువు మండలాలు

పుల్లలచెరువు, దొనకొండ, కురిచేడు, మర్రిపూడి, కంభం, తర్లుపాడు, పెద్దారవీడు, సంతనూతలపాడు, ఒంగోలు, వెలిగండ్ల, బేస్తవారపేట


ఒక మోస్తారు తీవ్రత ఉన్నవి..

కొనకనమిట్ల, మార్కాపురం, చీమకుర్తి, సీఎస్‌పురం, పామూరు, రాచర్ల

ఆయా మండలాల్లో తాగునీరు, పశుగ్రాసం కోసం నిధులు వచ్చే అవకాశం ఉంది. ఉపాధి హామీ పథకం పనులను గరిష్ఠంగా 100 రోజులకు బదులు 150 రోజుల వరకు పెంచనున్నారు.

జిల్లా అంతటా అదే పరిస్థితి

ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం జిల్లాలో 11 మండలాలు తీవ్ర, మరో ఆరు ఒక మోస్తరు తీవ్రత కరువు నెలకొన్న మండలాలుగా ఉన్నాయి. జిల్లా అంతటా రబీలో కరువు వాతావరణం నెలకొంది. కీలకమైన అక్టోబరు, నవంబరుల్లో సరైన వర్షాలు లేవు. పంటల సాగు కూడా అంతంతమాత్రంగానే ఉంది. అయితే డిసెంబరులో రెండు విడతలుగా అకాల వర్షాలు కురిశాయి. దీంతో చాలా మండలాల్లో ఈశాన్య రుతుపవనాల కాలంలో సాధారణ వర్షపాతంతోపాటు పంట సాగు జరిగింది. మొత్తంగా ఈ కాలంలో 384.80 మి.మీ సాధారణ వర్షపాతానికి 376.80 మి.మీ నమోదైంది. అదేసమయంలో 3.99 లక్షల ఎకరాల సాధారణ విస్తీర్ణానికి 3.01 లక్షల ఎకరాలు మాత్రమే సాగైంది. అంటే దాదాపు 25శాతం విస్తీర్ణంలో పంటలు పడలేదు. దీనికి తోడు సకాలంలో వర్షాలు కురవక పలుమార్లు డ్రైస్పెల్స్ ఏర్పడ్డాయి. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని 17 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించింది.





కందిపప్పు కష్టమే!

- మూడు నెలల నుంచి నిలిచిన సరఫరా
- ఈసారి కూడా జిల్లాకు రాని సరుకు
- బియ్యం, చక్కెర మాత్రమే అందజేత
- నేటి నుంచి రేషన్ పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మంగళవారం నుంచి రేషన్ పంపిణీ ప్రారంభం కానుంది. అందుకు అవసరమైన ఏర్పాట్లను ఆ శాఖ అధికారులు చేశారు. అయితే మూడు నెలల నుంచి కందిపప్పు సరఫరా కావడం లేదు. దీంతో కేవలం బియ్యం, పంచదార పంపిణీకి మాత్రమే పరిమితమయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కార్డుదారులకు కందిపప్పు ఇవ్వని పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బియ్యం, చక్కెర, కందిపప్పుతోపాటు చిరుధాన్యాలను కూడా సరఫరా చేస్తామని ప్రకటించారు. ఆతర్వాత రెండు, మూడు నెలలు కందిపప్పుతోపాటు జొన్నలు కూడా ఇచ్చారు. దీంతో కార్డుదారులు తమకు అన్నిరకాల సరుకులు దొరుకుతాయని ఆశించారు. నవంబరులో 70 శాతం కందిపప్పును ప్రభుత్వం జిల్లాకు కేటాయించింది. డిసెంబరులో అసలు ఇవ్వలేదు. జనవరి, ఫిబ్రవరిల్లోనూ అదే పరిస్థితి కొనసాగింది. తాజాగా ఏప్రిల్ 1నుంచి రేషన్ పంపిణీ ప్రారంభమవుతుండగా ప్రభుత్వం జిల్లాకు కేవలం బియ్యం, చక్కెరను మాత్రమే పంపింది. వాటిని అధికారులు రేషన్ షాపులకు తరలించారు.

లోకేష్ చొరవతోనే బయోగ్యాస్ ప్లాంట్

- దానితోనే పారిశ్రామిక అభివృద్ధికి పునాది
- ఈ ప్లాంట్‌తో ఎటువంటి కాలుష్యం ఉండదు
- కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

కనిగిరి నియోజకవర్గ ప్రజల దృష్టిలో యువనాయకులు నారా లోకేష్ ముఖ్యమంత్రితో సమానం అని శాసనసభ్యుడు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి వ్యాఖ్యానించారు. ఎడారిని తలపింపజేసే తమ ప్రాంతంలో రిలయన్స్ సంస్థ ద్వారా బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు ఆయన తీసుకున్న చొరవ అందుకు కారణమైందని చెప్పారు. బుధవారం నియోజకవర్గంలో బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ చేసే కార్యక్రమంలో లోకేష్‌తోపాటు రిలయన్స్ సంస్థ అధిపతుల్లో ఒకరైన అనంత్ అంబానీ కూడా పాల్గొంటున్నారని వివరించారు. స్వాతంత్ర్యం అనంతరం ఇప్పటి వరకు ఒక్క పరిశ్రమకు కూడా నోచుకోని నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు పునాది పడుతున్నదంటే అందుకు మంత్రి లోకేషే ప్రధాన కారకులని చెప్పారు. తనతోపాటు నియోజకవర్గ ప్రజలు లోకేష్‌కు కృతజ్ఞులమై ఉంటామని 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు. బయోగ్యాస్ ప్లాంట్ వలన ఎలాంటి కాలుష్యం ఉండదని స్పష్టం చేశారు.

ఈ ప్లాంటు వలన పొల్యూషన్ ఎదురుకావచ్చు కదా?

జీరో వేస్ట్ పొల్యూషన్ యూనిట్‌గా బయోగ్యాస్ ప్లాంట్ పనిచేస్తుంది. ఈ విషయం ఇప్పటికే నిర్ధారణ కూడా అయ్యింది. పరిశ్రమ రాకను చూసి ఓర్వలేక కొంతమంది వదంతులు పుట్టిస్తున్నారు.

పొగ అధికంగా వచ్చే అవకాశం లేదా?

కాలుష్యం లేని విధంగా పర్యావరణ హిత యూనిట్ నిర్మాణం జరుగుతోంది. ప్లాంట్ నిర్మాణ ప్రాంతం, చుట్టుపక్కల అంతా పచ్చిక బయళ్ల పెంపకం ద్వారా మంచి వాతావరణం కూడా ఏర్పడబోతోంది.

యూనిట్ నిర్మాణానికి ఎంత వ్యయం చేయనున్నారు?

రూ.130 కోట్ల వ్యయంతో ఈ యూనిట్ నిర్మాణం జరగనుంది.

రైతుల సాగు భూములు దెబ్బతినవా?

రైతుల భూముల్లో యూనిట్‌కు అవసరమైన గడ్డి పెంపకాన్ని రిలయన్స్ సంస్థ ప్రోత్సహిస్తుంది. విత్తనాలు, సాంకేతిక సహకారం ఇవ్వడంతోపాటు రైతుల సొంత భూమి అయితే ఎకరాకు ఏడాదికి రూ.31వేలు కౌలు కూడా చెల్లిస్తుంది. అసైన్డ్ భూమి అయితే ఎకరాకు రూ.15 వేలు ఇస్తుంది.

ఇలాంటి పరిశ్రమలు ఇంకా వచ్చే అవకాశం ఉందా?

హెలికాప్టర్ పరికరాలు తయారుచేసే ఒక సంస్థ ముందుకు వచ్చి భూమి కేటాయింపు కోసం ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. మరోవైపు సోలార్ విద్యుత్ యూనిట్‌ను సీఎస్‌పురం మండలంలో ప్రభుత్వమే ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. పరిశ్రమల స్థాపనకు నాంది పడుతున్నందున, అపారంగా ప్రభుత్వ భూములు ఉన్నందున మరికొన్ని పరిశ్రమలు వచ్చే అవకాశాలు లేకపోలేదు.

20లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం



అధికారులకు సూచనలిస్తున్న మంత్రి గొట్టిపాటి, పక్కన ఎమ్మెల్యే ఉగ్ర

- రాష్ట్రవ్యాప్తంగా 500సీబీజీ ప్లాంట్‌లు
- విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి
- రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ భూమిపూజ ఏర్పాట్ల పరిశీలన

వివరాలు మెయిన్‌లో..

నీలకంఠేశ్వరుడి మాన్యంలో
మళ్లీ గ్రావెల్ దొంగలు

- యథేచ్ఛగా దోపిడీ
- దేవుడి ఆదాయం అక్రమార్కుల జేబుల్లోకి..
- చూస్తూ ఉండిపోతున్న దేవదాయ శాఖ



ఆలయ భూముల్లో గ్రేడింగ్ చేసిన గులకరాళ్ల గుట్టలు



దేవుడి మాన్యంలో గ్రావెల్ తవ్వకాలు

ఉలవపాడు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లాలోని మండల కేంద్రం ఉలవపాడులో గల నీలకంఠేశ్వరస్వామి ఆలయ భూముల్లో మళ్లీ గుట్టుచప్పుడుగా మైనింగ్ దోపిడీ జరుగుతోంది. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం లోని శానంపూడి గ్రామం కొండ బీడులో సర్వే నెం.519లోని 30.05 ఎకరాల దేవుడి మాన్యం ఉంది. సదరు భూముల్లో సుమారు 20 ఎకరాల్లో రూ.10కోట్ల విలువైన గ్రావెల్ స్టోన్ కొల్లగొట్టినట్టు సమాచారం. గతేడాది జూలైలో దేవదాయశాఖ ఉన్నతాధికారులు ఆగమేఘాల మీద ఆలయ ఈవోలు జానకమ్మ, ప్రసాదులపై సస్పెండ్ వేటు వేశారు. దీంతో గ్రావెల్ స్టోన్ దోపిడీ ఆగినా కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి శానంపూడి గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు ఆలయ భూముల్లో ఎర్రమట్టి, గ్రావెల్ విస్తృతంగా తవ్వుతున్నట్టు సమాచారం.

పంథా మార్చి దోపిడీ

ఈవోల సస్పెండ్ వేటుతో వెనుకకు తగ్గిన దోపిడీ ముఠా పంథా మార్చి దందా నిర్వహిస్తున్నట్టు స్థానికులు మాట్లాడుకుంటున్నారు. ఆలయ భూములకు ఆనుకొని వ్యాపారి లీజుకు తీసుకున్న భూముల్లో గ్రావెల్ స్టోన్ గ్రేడింగ్ జరుగుతోంది. అయితే రాత్రివేళ ఆలయ భూముల్లో ఎక్స్‌కవేటర్‌తో గ్రావెల్ తీసి పక్కనే ఉన్న తన క్వారీలో విలువైన రాళ్ల గ్రేడింగ్ చేసి వచ్చిన ఎర్ర మట్టిని తిరిగి ఆలయ భూముల్లో దిబ్బలుగా పోస్తున్నారు. కొండబీడులో రూ.కోట్లు విలువ చేసే గ్రావెల్ స్టోన్ అక్రమార్కులకు అడ్డాగా మారినా దేవదాయ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఈవోల సస్పెన్షన్ తర్వాత విధుల్లోకి చేరిన అధికారులు కూడా ఈ భూములపై దృష్టి సారించకపోగా జరుగుతున్న దోపిడీ, అవినీతిని అరకట్టే ప్రయత్నం చేయడం లేదని గుసగుసలు వినబడుతున్నాయి.

ఉన్నతాధికారులకు ముడుపులు..

దేవుడి మాన్యంలో గ్రావెల్ దందా జరుగుతోందని, ఆలయానికి చెందాల్సిన ఆదాయం అక్రమార్కుల జేబుల్లోకి వెళుతోందని గతేడాది అప్పటి ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి రాష్ట్ర ఎండోమెంట్ మంత్రికి రాతపూర్వక ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి దేవదాయశాఖ ఏసీ, డీసీ ఉన్నతాధికారులు ఆలయ భూములను పరిశీలించి, చర్యలు తీసుకున్నారు. తిరిగి అదే దోపిడీ యథేచ్ఛగా గ్రావెల్ స్టోన్ అక్రమ రవాణా చేశాడంటే ఉన్నతాధికారులకు భారీగా ముడుపు ముట్టాయని అదే శాఖకు చెందిన వారే ఆరోపిస్తున్నారు. గ్రావెల్ దందా ముఠాకి ఉలవపాడు ఎండోమెంట్ కార్యాలయంలో ఒక చిరుద్యోగికి సత్సంబంధాలు ఉండటం, ఉన్నతాధికారులకు సదరు దోపిడీ ముఠా నుంచి భారీగా లంచాలు ఇప్పించారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో దిద్దుబాటు చర్యల్లో భాగంగా క్షేత్రస్థాయిలో ఈవోలను తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తూ ఉన్నతాధికారులు చేతులు దులుపుకున్నట్లు విమర్శలు వినపడుతున్నాయి.



ఉలవపాడులోని శ్రీనీలకంఠేశ్వరస్వామి ఆలయం

ఆక్రమణకు గురైన దేవుని మాన్యం

నీలకంఠేశ్వర ఆలయానికి 70 ఎకరాల మాన్యం ఉంది. అయితే, దేవదాయ అధికారులకు ఆ భూములు హద్దులు ఇప్పటికి తెలియకపోవడంతో విచారం. వచ్చిన ప్రతి ఈవో తమ సొంత ఆదాయ వనరులుగానే చూస్తున్నారే తప్ప ఆలయానికి ఆదాయం చేకూర్చుదామనే ఆలోచన లేకపోవడం గమనార్హం.

దీపధూప నైవేద్యాలకు నిధులేవీ..?

కోట్ల రూపాయల సంపదన ఇచ్చే మాన్యం భూములు ఉన్నా స్వామివారికి ధూపదీప నైవేద్యాలకు భక్తులు కానుకల మీదే ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఐదేళ్లుగా ఆలయం గోపురానికి కనీసం సున్నం కొట్టించిన దాఖాలు లేవు. ఇటీవల శివరాత్రి ఉత్సవాలు కూడా పూజారి అప్పు తెచ్చి జరిపించినట్లు మాట్లాడుకుంటున్నారు. శివాలయం దుస్థితికి కారకులపై గ్రామస్థులు, భక్తులు భగ్గుమంటున్నారు.

క్వారీ గుంతలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం

నాగులుప్పలపాడు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నిరుపయోగంగా ఉన్న క్వారీ గుంతలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఉప్పుగుండూరులో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, ఉప్పుగుండూరులోని భారత్ పెట్రోలు బంక్ ఎదురుగా జనసంచారం లేని తెల్లరాయి క్వారీ గుంతలో గుర్తుతెలియని సుమారు 35 ఏళ్ల వ్యక్తి మృతదేహం సోమవారం గుర్తించారు. నీటిపైన తేలాడుతూ దుర్వాసన వస్తున్నట్లు స్థానికులు గుర్తించి వెంటనే వీఆర్వో సుబ్బయ్యకు సమాచారం అందించారు. వెంటనే ఆయన పోలీసులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కుళ్లిన మృతదేహాన్ని బయటకు తీసి ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. బహిర్భూమికి వెళ్లి అదుపుతప్పి క్వారీ గుంతలో పడి రెండు రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి సంబంధిన ఎలాంటి ఆధారాలు ఘటనా స్థలంలో లభించలేదు. వీఆర్వో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గురుకులాల్లో ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

నాగులుప్పలపాడు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో చేరేందుకు, అలాగే 6,7,8 తరగతుల్లో ఖాళీలు భర్తీ చేసేందుకు, జూనియర్ ఇంటర్,డిగ్రీ కళాశాలల్లో మొదటి ఏడాది ప్రవేశ పరీక్షలకు దరఖాస్తుల గడువును ఈనెల 6వ తేదీ వరకు పొడిగించినట్లు అమ్మనబ్రోలు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.మాధవి ఓ ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలలో 5వ తరగతిలో 80, 7వ తరగతిలో 3, 8వ తరగతిలో 6 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షలకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఒంగోలు సబ్‌డివిజన్‌లో 30 పోలీసు చట్టం

- డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు క్రైం, మార్చి31(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఒంగోలు సబ్‌డివిజన్‌లో 30 పోలీసు చట్టం అమలు చేస్తున్నట్లు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 1 నుంచి 30వ తేదీ వరకు ఈ చట్టం అమలులో ఉంటుందన్నారు. పోలీసుల అనుమతి లేనిది సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు చేయకూడదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఒంగోలు(రూరల్), మార్చి31(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం యరజర్ల గ్రామంలో ఆదివారం రాత్రి గ్రామ పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముప్పనేని శ్రీనివాసులుమాస్టర్(ప్రైవేటు స్కూల్), ఆయన సతీమణి మాధవిలతను పూర్వవిద్యార్థులు గజమాల వేసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 700మందిపైగా విద్యార్థులను ఉన్నతస్థాయికి తెచ్చేందుకు శ్రీనివాసులు మాస్టర్ ఎంతో కృషి చేశారని చెప్పారు. ఎంతో మంది విదేశాల్లోను, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ ఉద్యోగాలు, బిల్డర్స్‌గా స్థిరపడ్డారని అందుకోసం శ్రీనివాసులుమాస్టర్ అందించిన సేవలను కొనియాడారు. అలాగే తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు కంకణాల వెంకట్రావు, గడ్డం వెంకటరావు, పుచ్చకాయల వెంకట్రావు, పుచ్చకాయిల సుబ్బారావు, కాకుమాను శ్రీనివాసులును సత్కరించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అలాగే అన్నదానం జరిగింది. కార్యక్రమంలో యరజర్ల, వెంగముక్కపాలెం, సర్వేరెడ్డిపాలెంలకు చెందిన సుమారు 300మంది పైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీనివాసులు మాస్టర్‌ను సత్కరించిన పూర్వ విద్యార్థులు



పోలీసు సిబ్బందిని సత్కరించిన ఎస్పీ దామోదర్

ఉద్యోగ విరమణ సిబ్బందికి సత్కారం

ఒంగోలు క్రైం, మార్చి31(ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖలో సుదీర్ఘకాలం పని చేసి ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందిని ఎస్పీ ఏఆర్.దామోదర్ సోమవారం ఘనంగా సత్కరించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఏఎస్ఐగా పనిచేసిన జి.శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుళ్లు కేవీ.రమణారెడ్డి, సీహెచ్.శ్రీనివాసులుకు ఎస్పీ శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఎస్పీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఏఆర్ ఎస్ఐ తిరుపతిస్వామి పాల్గొన్నారు.

చీరల పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా భారతీయ జనతా మజ్దూర్ సెల్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక విశ్వసేవిక్‌ట్రస్ట్ వృద్ధుల ఆశ్రమంలో ఉంటున్న వృద్ధురాళ్లకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు షేక్ ఖలీఫాతుల్లా, మజ్దూర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ సిద్దాంబీ, ఆదిల్ గ్రూప్ ఆఫ్ ఎండీ ఆదిల్ తదితరులు ఉన్నారు. అనంతరం స్థానిక సుజాతనగర్‌లోని మసీద్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందును వారు ఇచ్చారు.

ముస్లింల సంక్షేమమే ధ్యేయం

- మంత్రి స్వామి
- కొండపి ఈద్గాలో ప్రార్థనలు
- భక్తిశ్రద్ధలతో రంజాన్

కొండపి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ముస్లింల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. వారి అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. రంజాన్ సందర్భంగా కొండపి ఈద్గాలో సోమవారం నిర్వహించిన ప్రార్థనల్లో మంత్రి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈద్గాను గడచిన టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసుకున్నామన్నారు. ముున్ముందు స్థానిక ముస్లింలకు అవసరమైన ఖబరస్థాన్, ప్రహరీ, ఇతర వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి, టీడీపీ నాయకులు బత్తుల నారాయణస్వామి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, చాగంరెడ్డి నరసారెడ్డి, బూదవాటి సోమయ్య, నన్నూరి సుబ్బరామయ్య టీడీపీ యూత్ అధ్యక్షుడు షేక్ ఖాతీషా, సల్మా తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండలో..

సింగరాయకొండ : మండలంలోని ముస్లింలు రంజాన్‌ను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఈద్గామిట్ట వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మధ్యాహ్నం టీడీపీ సీనియర్ నేత షేక్ సందానీ బాషా గృహంలో ఏర్పాటు చేసిన విందులో మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ సీనియర్ నేత దామచర్ల పూర్ణచంద్రరావు పాల్గొన్నారు. అనంతరం ముస్లింలకు వారు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఒంగోలులో..

ఒంగోలు (కల్చరల్): రంజాన్ పండగను ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒంగోలు నగరం కొత్తపట్నం బస్టాండు దగ్గర ఉన్న ఈద్గాలో వేలాదిమంది రంజాన్ ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈద్గా అభివృద్ధి కమిటీ ఆ ధ్వర్యంలో ఏర్పాట్లను చేశారు. ఇమాం మౌలానా షేక్ హుస్సేన్ ముస్లింలకు ఖురాన్‌ను వివరించి అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. నగరం, చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రార్థనలకు వచ్చే ముస్లింలు, అక్కడ వారు ఉపయోగించే టోపీలు, కర్చీలు, అత్తరు వంటివి అమ్మే దుకాణాలతో ఆ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది. అదేవిధంగా పలు రాజకీయ పార్టీల నాయకులు సైతం వచ్చి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గా అభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ అబ్దుల్‌జబ్బార్, సెక్రటరీ ఎస్‌డీ.జిలానీ, ట్రెజరర్ ఎస్‌కే.మస్తాన్, కమిటీ సభ్యులు అబ్దుల్‌రషీద్, షేక్ యాసిన్, కరీముల్లాఖాన్, అహమ్మద్, గౌస్‌బాషాలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పీర్లమాన్యంలో ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే బీఎన్



ఒంగోలులో టోపీలను కొనుగోలు చేస్తున్న ముస్లింలు

పీర్లమాన్యంలో

సంతనూతలపాడు: రంజాన్ పండుగను పురస్కరించుకుని పలు గ్రామాల్లో సోమవారం ప్రత్యేక పార్థనలు చేశారు. పేర్నమిట్ట 39వ డివిజన్ పీర్లమాన్యంలోని మసీద్‌లో జరిగిన ప్రార్థనల్లో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్ మలగా రమేష్, టీడీపీ నాయకులు కరిచేటి శ్రీను, వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డి, షేక్ అమానుల్లా, సాహెబ్, రఫీ, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సంతనూతలపాడులోని మైనంపాడు డొంక సమీపంలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: మండలంలో రంజాన్ పండగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మద్దిపాడులోని ఇందిరమ్మకాలనీలో గల ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్ద షేక్ షిరాజ్ పాల్గొన్నారు. అటు వెల్లంపల్లి, ఇనమనమెళ్లూరు, రాచవారిపాలెం గ్రామాల్లో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి.

చీమకుర్తిలో..

చీమకుర్తి: రంజాన్ పండగను సోమవారం చీమకుర్తిలో భక్తిశ్రద్ధలతో ముస్లింలు జరుపుకున్నారు. స్థానిక ఈద్గా మైదానంలో పెద్దఎత్తున ముస్లింలు పాల్గొని సామూహిక ప్రార్థనలు జరిపి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



మద్దిపాడు ఈద్గాలో ప్రార్థనలు



చీమకుర్తి ఈద్గా మైదానంలో..

ఆదర్శ ఉపాధ్యాయురాలు అరుణకుమారి

మద్దిపాడు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది వారి ఉన్నతి కోసం అహర్నిశలు కృషిచేసిన ఆదర్శ ఉపాధ్యాయురాలు అరుణ కుమారి అని టీడీపీ మండల అధ్యక్షుడు మండల జయంత్‌బాబు పేర్కొన్నారు. సోమవారం బసవన్నపాలెం ఎయిడెడ్ పాఠశాలలో టీచరుగా పనిచేసిన అరుణకుమారి ఉద్యోగ విరమణ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆమెను సత్కరించి ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు గన్నెపూడి వెంకటేశ్వర్లు, రెబ్బవరపు రాఘవరావు, రెబ్బవరపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

సంతనూతలపాడు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రుద్రవరం గ్రామంలో కూకట్ల కోటయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్మార్ట్‌విజన్ ఐ హాస్పిటల్ వారి సహకారంతో కంటి పరీక్షలు జరుగుతాయని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

'ఉదయం' స్ఫూర్తితో సమస్యలపై పోరాటం

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మహిళా ఉద్యమనేత మోటూరి ఉదయం స్ఫూర్తితో సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో సోమవారం ఉదయం వర్థంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రామదేవి మాట్లాడుతూ ఉదయం స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, ఆ తర్వాత రాష్ట్రంలో మహిళా సంఘాన్ని ఏర్పాటు చేయడంలో ప్రధాన పాత్ర పోషించారని కొనియాడారు. ఆమె స్ఫూర్తితో మహిళల సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బి.రాజ్యలక్ష్మి, బి.పెద్దగోవిందమ్మ, ఎస్.మాలతి, కె.రాజేశ్వరి, కె.రాణి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

కారు ఢీకొని ఆటో బోల్తా

- 15 మంది కూలీలకు తీవ్ర గాయాలు
- ఇరువురు పరిస్థితి విషమం
- క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే కొండయ్య

చినగంజాం(చీరాల), మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పొట్టకూటి కోసం కూలి పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో కారు రూపంలో ప్రమాదం ముంచుకొచ్చింది. చినగంజాం - రొంపేరు మధ్యలో ఆటోను ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడింది. 15 మంది కూలీలకు, కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. చీరాల మండల పరిధిలోని బోయినవారిపాలెంకు చెందిన బ్రహ్మేశ్వరి, శివ, పోలేరు, హేమలత, ఆదిలక్ష్మి, రమాదేవి మరో తొమ్మిది మంది రోజులాగే నాగులుప్పలపాడు సమీపంలోని ప్రాసంగులపాడు వద్ద మిర్చి కోతలకు ఆటోలో వెళ్లారు. సాయంత్రం వరకు పనులు చేసి తిరిగి ఆటోలో ఇంటికి వెళుతుండగా చినగంజాం - రొంపేరు మధ్యలోని రహదారిలో ఎదురుగా వస్తున్న కారు వేగంగా ఆటోను ఢీకొంది. దీంతో ఆటో ఎగిరిబోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న మహిళలు అందరూ తీవ్రంగా గాయపడ్డారు. వారందరూ చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అలాగే కారు డ్రైవర్ సమీర్, మరో వ్యక్తి షంషాద్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉంది. ఈక్రమంలో సమీర్‌ను ఒంగోలు రిమ్స్‌కు తరలించగా, షంషాద్ చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. కూలీలు చీరాల ఏరియా వైద్యశాలలోనే చికిత్స పొందుతున్నారు.

మెరుగైన వైద్యం అందించండి - ఎమ్మెల్యే కొండయ్య

ప్రమాద సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య హుటాహుటిన చీరాల ఏరియా వైద్యశాలకు చేరుకున్నారు. ప్రమాదం గురించి బంధువులతో మాట్లాడి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

జీవనోపాధి ప్రణాళికలపై శిక్షణ

కొండపి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘ సభ్యుల జీవనోపాధి ప్రణాళికల తయారీపై ఎన్యుమరేటర్లకు ఏపీవో బి.గోపీనాథ్ సోమవారం కొండపిలోని వెలుగు కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కొండపి, పెదకండ్లగుంట, జాళ్లపాలెం, పెరిదేపి, మిట్టపాలెం గ్రామా పంచాయతీల వీవోఏలు, ఎన్యుమరేటర్లతోపాటు సీసీలు డి.మల్లికార్జున, గోవిందమ్మ, కె.రామానుజులు, రమణమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు.

పేద ముస్లింలకు నిత్యావసరాలు

ఒంగోలు(రూరల్), మార్చి31(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలులోని మసీదులో సోమవారం రంజాన్ రంజాన్ పండగను పురస్కరించుకుని షేక్ శ్రీను బాషా మన్ హు ఫౌండేషన్ సంస్థ ద్వారా పేద ముస్లింలకు నిత్యావసరాలను అం దజేశారు. కార్యక్రమంలో షేక్ ఆయేషా, మస్తానయ్య, షేక్ బుడే, దూద్‌సాహెబ్, షేక్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కొప్పోలు చెరువు కట్ట అధ్వానం

- గుంతలతో ఇబ్బంది పడుతున్న వాకర్స్
- వాకింగ్ ట్రాక్‌గా అభివృద్ధి చేయాలని వినతి

ఒంగోలు(రూరల్), మార్చి31(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు గ్రామ పరిధిలో గల చెరువు కట్టనును వాకింగ్‌ట్రాక్‌గా అభివృద్ధి చేయాలని వాకర్స్ కోరుతున్నారు. కొప్పోలు ఒంగోలు నగరంలో విలీనమయిన తరువాత అభివృద్ధి బాటలో ముందుకు సాగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్త చేస్తున్నారు. నగరానికి సమీపంలో ఉండే కొప్పోలు గ్రామ పరిసరాలలో పలు కాలనీలు ఏర్పడ్డాయి. రైల్వే ఫ్లైఓవర్ వంతెన దగ్గర నుంచి సుమారు 10కాలనీలు పైగా కొప్పోలు చెరువుకు దగ్గరగా ఉన్నాయి. దీంతో ఆయా కాలనీల ప్రజలు ప్రతిరోజు వాకింగ్ కోసం చెరువు కట్టకు వస్తుం టారు. అయితే ఈ చెరువు కట్టపై గుంతలు ఏర్పడి నడవంటం చాలా కష్టంగా ఉంటోందని వాకర్స్ వాపోతున్నారు. సుమారుగా 65 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు చుట్టూ వాకింట్ ట్రాక్ అభివృద్ధి చేస్తే ఉపయుక్తంగా ఉంటుందని, అందువల్ల పాలకులు, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న చెరువుకట్ట

- అధికారులతో కలిసి పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే ఉగ్ర
- ప్రతిపాదిత ప్రాంతానికి 4 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం
- ముఖ్యఅతిథుల కోసం రెండు హెలిప్యాడ్‌లు సిద్ధం
- వాహనాల పార్కింగ్‌కు వేర్వేరు ప్రాంతాలు

బయోగ్యాస్ ప్లాంట్ భూమిపూజకు..


బహిరంగ సభ కోసం బారికేడ్లు కట్టి ఏర్పాటు చేసిన గ్యాలరీలు

బహిరంగసభకు తరలివచ్చే వారితో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలకు చెందిన ద్విచక్ర వాహనాలకు, ఇతర వాహనాలకు వేర్వేరుగా పార్కింగ్ ఏర్పాటుచేశారు. హెలిప్యాడ్‌ల చుట్టూ కట్టిన బారికేడ్లను దాటి ప్రజలు అవతలవైపునకు వెళ్లకుండా పోలీసులకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

సర్వం సిద్ధం

పీసీపల్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాయపల్లి పంచాయతీ పరిధిలోని దివాకరపల్లి సమీపంలో బుధవారం జరగనున్న రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ భూమిపూజకు సర్వం సిద్ధమైంది. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పర్యవేక్షణలో వివిధశాఖల అధికారులు పనులన్నీ పూర్తిచేశారు. విద్యుత్ లైన్లు ఏర్పాటుచేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు. భూమిపూజ జరిగే ప్రాంతానికి వచ్చేందుకు వీలుగా వీఐపీలకు మురుగుమ్మి నుంచి ప్లాంట్ వరకు మూడు కిలోమీటర్లు, దివాకరపల్లి నుంచి ప్లాంట్ వరకు నాలుగు కిలోమీటర్ల మేర పంచాయతీరాజ్ అధికారులు రోడ్లు వేయించారు. వీవీఐపీల రాకకోసం ఆర్‌అండ్‌బీ అధికారులు రెండు హెలిప్యాడ్‌లను నిర్మించారు. బహిరంగ సభ జరిగే ప్రాంతంలో స్టేజీ నిర్మాణంతో పాటు ప్రజలకు ఎండ తగలకుండా జర్మన్ షెడ్‌లు ఏర్పాటుచేశారు. సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర, పోలీసులకు, అధికారులకు ట్రాఫిక్ సమస్యపై పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే వెంట వెంగళాయపల్లి సర్పంచ్ కరణం తిరుపతయ్య, మండలంలోని వివిధశాఖల అధికారులు, మండల నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు భైరెడ్డి జయరాంరెడ్డి, కావేటి సుబ్బయ్య, సీఎస్‌పురం టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు వెంగయ్య తదితరులు ఉన్నారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

నేటి నుంచి సీనియర్ ఇంటర్ తరగతులు



- 7 నుంచి జూనియర్ ఇంటర్ అడ్మిషన్లు
- మొదటి సంవత్సరం సీట్ల ఖరారులో రిజర్వేషన్లు

ఒంగోలు విద్య, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్ 2025-26 విద్యాసంవత్సరం అడ్మిషన్ల షెడ్యూల్‌ను ఇంటర్ విద్యా కార్యదర్శి కృతికాశుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం నుంచి ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల విక్రయం ప్రారంభం కానుంది. ఏప్రిల్ 7నుంచి అడ్మిషన్ల ప్రక్రియ మొదలవుతుంది. మే 31వ తేదీ నాటికి అడ్మిషన్లు పూర్తి చేయాలని షెడ్యూల్ విడుదల చేశారు. గతంలో సీనియర్ ఇంటర్ విద్యార్థులకు ఏటా జూన్ 1నుంచి తరగతులు ప్రారంభించేవారు. ప్రస్తుతం రెండు నెలలు ముందుగానే అంటే మంగళవారం నుంచి తరగతులు ప్రారంభిస్తున్నారు. మొదటి సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ కూడా జూన్‌లోనే ప్రారంభమయ్యేవి. అటువంటిది వచ్చే విద్యా సంవత్సరం రెండు నెలలు ముందుగా ఏప్రిల్‌లోనే ప్రారంభంకానుంది. ఏప్రిల్ 7 నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. అప్పటికి 10వ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి కానందున విద్యార్థుల హాల్ టికెట్ల ఆధారంగా ప్రాథమికంగా అడ్మిషన్లు ఇవ్వనున్నారు. పది ఫలితాలు వచ్చాక పాస్ సర్టిఫికెట్లు, టీసీలతో అడ్మిషన్లను ఫైనల్ చేయనున్నారు. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూనియర్ కళాశాలలకు వేసవి సెలవులు ప్రకటించి జూన్ 2నుంచి కళాశాలలు పునః ప్రారంభించనున్నారు.

అడ్మిషన్లలో రిజర్వేషన్లు

ఇంటర్ అడ్మిషన్లలో రిజర్వేషన్లను పాటించనున్నారు. మొత్తం సీట్లలో ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు ఆరుశాతం, బీసీలకు 29శాతం, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు 3శాతం, ఎన్‌సీసీ, స్పోర్ట్స్‌లకు 5శాతం, మాజీ సైనికోద్యోగులు, సైనికోద్యోగుల పిల్లలకు 3శాతం, ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు పదిశాతం సీట్లు కేటాయించాలి. జనరల్ అయితే 88 మంది, ఒకేషనల్ అయితే 30 మంది చొప్పున ఎన్ని సెక్షన్లకు అనుమతి ఉంటే అంత మందిని మాత్రమే చేర్చుకోవాలి. కళాశాలల్లో అన్ని గ్రూపుల్లో అందుబాటులో ఉన్న సీట్ల సంఖ్యను నోటీసు బోర్డులో ప్రదర్శించాలి. రోజువారీ ఇంకా ఎన్ని సీట్లు ఖాళీ ఉంది కూడా ప్రకటించాలి. కళాశాల మొత్తం సీట్లలో మూడోవంతు సీట్లు విద్యార్థినులకు కేటాయించాలి. అడ్మిషన్లకు ఎటువంటి పరీక్షలు నిర్వహించకుండా కేవలం పదో తరగతి మార్కుల ఆధారంగానే విద్యార్థులకు సీట్లు కేటాయించాలి.

గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్ వద్ద తనిఖీలు

మద్దిపాడు, మార్చి31(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై గంజాయి రవాణా అవుతోందన్న సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం సాయంత్రం విస్తృతంగా తనిఖీలు నిర్వహిచారు. మద్దిపాడు మండలం గ్రోత్‌సెంటర్ వద్ద ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. ఓ వాహనంలో గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో అప్రమత్తమయ్యారు. గ్రోత్‌సెంటర్ వద్ద సుమారు గంట పాటు తనిఖీలు నిర్వహిచారు. అయితే ఈ తనిఖీలలో ఎలాంటి మత్తు పదార్థాలు దొరకలేదని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐలు నాగరాజు, అజయ్‌కుమార్, మద్దిపాడు ఎస్ఐ శివరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


కారును ఆపి తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

భక్తులకు రైల్వేస్టేషన్ వద్ద అన్నదానం


మార్కాపురం రైల్వే స్టేషన్ వద్ద శ్రీశైలం వెళ్లి వచ్చిన కన్నడ భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు

మార్కాపుర రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలంలో మల్లికార్జున భ్రమరాంబ అమ్మవార్లను దర్శించుకొని మార్కాపురం రైల్వే స్టేషన్‌కు వచ్చిన కన్నడ భక్తులకు సోమవారం భక్తులకు అన్నదానం చేశారు. ఉగాది పర్వదినం సందర్భంగా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు వేల సంఖ్యలో శ్రీశైలం చేరుకుని అమ్మవారు, స్వామి వార్లను దర్శించుకున్నారు. వారంతా తిరుగు ప్రయాణంలో మార్కాపురం రైల్వేస్టేషన్ నుంచి కర్ణాటక వెళ్లారు. వారికి దాతల సహకారంతో మార్కాపురం ప్రాంతవాసులు ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకు సుమారు 15వేల మంది కన్నడ భక్తులకు అల్పాహారం, అన్నదానం నిర్వహించారు. స్వయంగా వారికి భోజనాలు వడ్డించి, మంచినీరు తదితర సదుపాయాలను పర్యవేక్షించారు. పది సంవత్సరాల నుంచి కన్నడ భక్తులకు ఉగాది పర్వదినం సందర్భంగా భోజన వసతిని కల్పించడం ఆనవాయితీగా వస్తోందని దాతలు తెలిపారు. కార్యక్రమంలో సేవా సంఘాల ప్రతినిధులు, జర్నలిస్టులు, దాతలు పాల్గొన్నారు.

రెండు బైక్‌ల ఢీ... నలుగురికి తీవ్ర గాయాలు

ముండ్లమూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు వద్ద సోమవారం రాత్రి 9-30 గంటల సమయంలో రెండుబైక్‌లు ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకెళ్తే... పసుపుగల్లు ఎస్సీ కాలనీకి చెందిన వరగాని మనోజ్‌కుమార్, మరొక యువకుడు బైక్‌పై గ్రామంలోకి వస్తుండగా దర్శి మండలం శివాజీనగర్‌కు చెందిన తమ్మిశెట్టి ప్రసాద్, భార్య కుమారి శింగరకొండ వెళ్తుండగా పరస్పరం ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని దర్శి, ఒంగోలులోని ఆస్పత్రులకు తరలించారు.

పన్నుల వసూళ్లలో కార్పొరేషన్ సక్సెస్..!

- గత ఏడాదితో పోలిస్తే రూ.10 కోట్లు అదనం
- ప్రజలకు, సిబ్బందికి కమిషనర్ అభినందన


పన్నుల చెల్లింపు వివరాలను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థకు ఆదాయ వనరులైన పన్నుల వసూళ్లలో కార్పొరేషన్ లక్ష్యాలను చేరుకుంది. ఈ మేరకు పదిరోజు క్రితం వరకు నత్తనడకన సాగిన పన్నుల వసూలు ప్రక్రియ ఈ పది రోజుల్లో మరింత వేగంతం అయింది. గత ఏడాది మార్చి 31నాటికి వసూళ్ల కంటే అదనంగా రూ.10 కోట్లు సాధించడం ఆనందంగా ఉందని కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వరరావు తెలిపారు. నూరు శాతం పన్నులు వసూళ్ల లక్ష్యంగా పురపాలక శాఖ ఆస్తిపన్నులపై యాభై శాతం వడ్డీ రాయితీ ప్రకటించగా అందుకు మార్చి 31తో గడువు విధించడంతో సోమవారం అర్ధరాత్రి వరకు పెండింగ్ పన్నుల వసూళ్లలో కార్పొరేషన్ రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సెక్రటరీలు కష్టపడి పనిచేశారని తెలిపారు. దీంతో సోమవారం ఒక్కరోజే రూ.1 కోటి 60 లక్షలు వసూలు చేసినట్లు కమిషనర్ తెలిపారు. 2023-24కు ఆర్థిక సంవత్సరంలో సంబంధించి ఆస్తిపన్ను రూ.30.32 కోట్లు (47.34శాతం) వసూలు చేయగా, ఈ ఆర్థిక సంవత్సరం 2024-25లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఆస్తి పన్ను రూ.41.04 కోట్లు, (57.14 శాతం), నీటి పన్ను రూ. 8.54 కోట్లు (44.29 శాతం) వసూలు చేసినట్లు చెప్పారు. దీంతో గత ఏడాదితో పోలిస్తే రూ.10 కోట్లు ఎక్కువ వసూలు అయ్యాయని అన్నారు. అతి కొద్ది సమయంలో కార్పొరేషన్ నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో కార్పొరేషన్ రెవెన్యూ సిబ్బంది. సచివాలయ సెక్రటరీలు నిరంతర కృషితో లక్ష్యాలను చేరుకున్నట్లు చెప్పారు. అలాగే ప్రజలు కూడా వడ్డీ రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో పన్నులు చెల్లించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ తరుపున రెవెన్యూ సిబ్బందిని, సచివాలయ సెక్రటరీలను, సహకరించిన ప్రజలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.

12న రామతీర్థం ఉత్సవం

- 11న చీమకుర్తిలో మందిరాల సంబరాలు
- తిరునాళ్లకు ప్రారంభమైన ప్రభల నిర్మాణాలు

చీమకుర్తి, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధిగాంచిన రామతీర్థం గంగమ్మతల్లి తిరునాళ్లను చైత్రశుద్ధ పౌర్ణమి రోజైన ఈనెల 12వ తేదీన అంగరంగ వైభవంగా నిర్వహించటానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ముందురోజైన 11వ తేదీన చీమకుర్తిలో మందిరాల సంబరాలు నిర్వహించనున్నారు. ఐదురోజుల పాటు సంప్రదాయబద్ధంగా నిర్వహించే తిరునాళ్ల మహోత్సవంలో రామతీర్థం నిధిలో 12న ప్రధాన ఘట్టం జరుగుతుంది. ఉదయం నుంచే మొక్కుబడి పొంగళ్లు భక్తులు చెల్లిస్తారు. రాత్రివేళ భారీ విద్యుత్‌ప్రభలను ఏర్పాటుచేసి టీవీ, సినీ కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. తిరునాళ్లలో ఏర్పాటు చేసే విద్యుత్ ప్రభల నిర్మాణ పనులకు వివిధ పార్టీలకు చెందిన వారు ప్రారంభించారు. సోమవారం హరిహరక్షేత్రం సమీపంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోయే ప్రభ నిర్మాణ పనులకు నాయకులు కొబ్బరికాయలు కొట్టి శ్రీకారం చుట్టారు.

రామతీర్థం నిధిలో చీమకుర్తి నుంచి టీడీపీ, జనసేన, వైసీపీల నుంచి ఒక్కొక్కటి, అలాగే రాజుపాలెం, బూదవాడ, కంభంపాడు గ్రామాల నుంచి టీడీపీ ప్రభలు నిర్మించటానికి ఇప్పటి వరకు సన్నాహాలు జరుగుతున్నాయి. మొత్తం మీద తిరునాళ్ల నాటికి పది వరకూ ప్రభలు ఏర్పాటుచేసే అవకాశం ఉంది. చీమకుర్తి పట్టణంలో కూడా మందిరాల ప్రభలను మందిరాల సంబరాల రోజున ఏర్పాటు చేయటానికి సంసిద్ధులవుతున్నారు.


ప్రభ నిర్మాణానికి కొబ్బరికాయలు కొడుతున్న టీడీపీ నాయకులు

తిరునాళ్ల మాటున దోపిడీ

- జాళ్లపాలెంలో ఇష్టానుసారం వసూళ్లు
- గుండుకు రూ.150
- దుకాణదారుల నుంచీ భారీగా దండుకున్నవైనం
- మఠం నిర్వాహకులు, అధికారుల తీరుపై విమర్శలు


ఆలయం వద్ద భక్తులకు గుండు గీస్తున్న క్షురకులు

కొండపి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాళ్లపాలెం వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల మాటున కొందరు వసూళ్లపర్వం కొనసాగించారు. దుకాణాల ఏర్పాటు, ఇతరత్రా వ్యాపారాలు చేసిన వారి నుంచి భారీ మొత్తాలు దండుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి అదేసమయంలో స్వామివారికి తలనీలాలు సమర్పించే వారికి ఒక రేటు నిర్ణయించి వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వీరబ్రహ్మేంద్ర స్వామి మఠాన్ని గత వైసీపీ ప్రభుత్వం దేవదాయశాఖలో విలీనం చేసింది. అప్పట్లో గ్రామానికి చెందిన కొత్తపల్లి బ్రహ్మయ్య వారసులు అది ఆలయం కాదు మఠం అంటూ కోర్టు కెక్కారు. అది న్యాయస్థానంలో నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఏటా తిరునాళ్లను అడ్డం పెట్టుకొని కొందరు దండిగా డబ్బులు పోగేసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈసారి తిరునాళ్ల సందర్భంగా ఆదివారం తలనీలాలు సమర్పించిన ఒక్కొక్కరి వద్ద రూ.150 వసూలు చేశారని భక్తులు వాపోతున్నారు. క్షురశాల కొత్తగా కట్టింది కాదని, ఎప్పటినుంచో ఉన్నదేనని భక్తులు తెలిపారు.

ఎవరి కానుకలు వారివే.

కానుకల విషయమై కూడా దేవదాయశాఖ, మఠం నిర్వాహకులు రెండేళ్ల క్రితం కోర్టు కెక్కారు. దీంతో స్వామి పాదుకల కానుకలు వారసులు, ఆలయం లోపల, వెలుపల హుండీలను ఏర్పాటు చేసి ఆ కానుకలను దేవదాయశాఖ తీసుకోవాలని గతంలో కోర్టు ఉత్తర్వులిచ్చింది. దీంతో ఎవరికి వారు మైకులు పెట్టి భక్తులు తమకు కానుకలు వేయాలని తిరునాళ్ల రోజంతా ప్రచారం చేశారు. తమ మైకు వినపడకుండా చేసి కానుకలన్నీ దేవాదాయశాఖ వారే రాబట్టుకున్నారని మఠం నిర్వాహకులు వాపోతున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి హుండీ ఆదాయం రూ.8.85లక్షలు

జాళ్లపాలెం వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల సందర్భంగా రూ.8.85 లక్షల హుండీ ఆదాయం లభించినట్లు ఈవో కొండారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కానుకలను సోమవారం ఉదయం నుంచి సిబ్బంది లెక్కించారన్నారు. ఈమొత్తాన్ని దేవదాయ శాఖ ఖాతాలో జమ చేస్తామన్నారు. ఇప్పటి వరకూ ఆలయ ఖాతాలో రూ.11.53 లక్షలు, మరో రూ.5 లక్షల డిపాజిట్ ఉందని ఆయన వివరించారు. ఇదిలా ఉండగా ఈసారి తిరునాళ్ల ప్రశాంతంగా ముగిసింది. గడచిన ఏడాది తారాజువ్వ పడి అన్నదాన కేంద్రం టెంట్లు, పలు మోటార్ సైకిళ్లు కాలిపోయాయి. రెండేళ్ల క్రితం ట్రాక్టర్ బోల్తాపడి పలువురికి గాయాలయ్యాయి. ఈసారి ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే తిరునాళ్లలో దొంగలు చేతివాటం చూపారు. పలువురి పర్సులను కొట్టేశారు.

దుకాణాలకు బాడుగలు



తిరునాళ్ల సందర్భంగా గ్రామంలో రోడ్ల వెంట తాత్కాలికంగా బొమ్మలు, చిన్నారుల ఆట వస్తువులు, చెరుకులు అమ్మే ట్రాక్టర్లు, టిఫిన్ దుకాణాలు ఏర్పాటు చేశారు. ఎవరి ఇంటి ముందు వారు దుకాణాల యజమానుల నుంచి అద్దెలు వసూలు చేసుకున్నారని తెలిసింది. చిన్నారులు ఎక్కే జెయింట్ వీల్స్ యజమానుల నుంచి కొందరు భారీగానే డబ్బులు గుంజినట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ విషయాలపై ఈవో కొండారెడ్డి మాట్లాడుతూ.. గుడికి చుట్టుపక్కల మాత్రమే తమ పరిధిలో దుకాణాలకు వేలం పాటలు నిర్వహించామని, మిగతా వాటి నుంచి ఎవరు అద్దెలు వసూలు చేశారో తమకు తెలియదన్నారు. దర్శన టికెట్లు అమ్మాలన్న ఉత్తర్వులు ఉన్నా తాము భక్తులకు అసౌకర్యం కలగకూడదన్న ఉద్దేశంతో విక్రయించలేదని వివరించారు.

పిచ్చమ్మకు ఘన నివాళి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి, జనసేన పార్టీ నేత బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి శచీదేవి మాతృమూర్తి యర్రం పిచ్చమ్మకు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక లాయర్‌పేటలోని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి నివాసంలో సోమవారం పిచ్చమ్మ ఉత్తరక్రియలు జరిగాయి. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి శచీదేవి, కుమారుడు ప్రణీత్‌రెడ్డి, పలువురు నాయకులు హాజరై పిచ్చమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా వైవీ నివాసంలో జరిగిన ఉత్తరక్రియల కార్యక్రమంలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన వైసీపీ నాయకులు భారీగా తరలివచ్చారు. వైవీ కుటుంబసభ్యులను పరామర్శించారు.


పిచ్చమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, కుటుంబ సభ్యులు

అవీ..ఇవీ

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కంభం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కంభం మండలం యర్రబాలెం గ్రామానికి చెందిన వెలుగొండయ్య (47) లింగాపురం గ్రామసమీపంలోని పొలాల్లో కంచెకు బిగించిన విద్యుత్ కనెక్షన్ గమనించక దానిని పట్టుకుని అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకొంది. కంభం ఎస్సై నరసింహారావు కథనం మేరకు, వెలుగొండయ్య పొలాల్లో కుందేళ్ల వేటకు వెళ్లాడు. అయితే సమీపంలోని పొలానికి వేసిన విద్యుత్ కంచెను తగలడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. ఆదివారం సాయంత్రం సమాచారం తెలియడంతో అక్కడకు వెళ్లి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం మత్తులో కారుతో బీభత్సం



విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

కొమరోలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి మద్యంమత్తులో కారుతో ఓ వ్యక్తి బీభత్సం సృష్టించాడు. ఈ ఘటన కడప- అమరావతి ప్రధాన రహదారిలోని పోస్టాఫీసు సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకొంది. అందిన వివరాల మేరకు, కొమరోలుకు చెందిన **మోతే వెంకటప్రసాద్** మద్యం సేవించి కారును నడుపుతూ, రోడ్డుపక్కనే ఉన్న ఓ ప్రైవేటు నేమ్ బోర్డును ఢీకొని విద్యుత్ స్తంభం ఢీకొట్టింది. దీంతో కారు స్తంభం ఇనుప చువ్వల్లో ఇరుక్కుని పోయింది. ఈ ప్రమాదంలో విద్యుత్ తీగలు రోడ్డుపై చెల్లాచెదరుగా పడ్డాయి. వెంటనే స్థానికులు పోలీసులకు, విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానిక ఎస్సై నాగరాజు ఘటనా స్థలానికి వచ్చి మద్యంసేవించి కారును నడిపిన వ్యక్తిని, కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ అధికారులు తెగిపోయిన తీగలకు మరమ్మతు చేశారు. లైన్‌మెన్ మాల్యాద్రి తన సిబ్బందితో కలసి అర్ధరాత్రి నుంచి హుటాహుటిన మరమ్మతు పనులను చేపట్టారు. సమయానికి స్పందించిన పోలీసు, విద్యుత్ అధికారులను స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. అర్ధరాత్రి సమయం కావడంతో ఆ తీగలు ఎవరిపై పడకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఘటనపై విద్యుత్‌శాఖ అధికారులు కూడా కేసు నమోదు చేయనున్నట్లు తెలిసింది.

మటన్, చికెన్ ధరలకు రెక్కలు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండుతున్న ఎండలకు తోడు మార్కాపురంలో సోమవారం మటన్, చికెన్ ధరలకు చుక్కలు చూపించాయి. మండుతున్న ధరలు చూసి వినియోగదారులు బెంబేలెత్తారు. రంజాన్ పండుగ సందర్భంగా మాంసం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలను పెంచారు. మటన్ కిలో రూ.800 ఉండగా, సోమవారం రూ.1000కి పెంచారన్నారు. రూ.150 ఉన్న చికెన్ ధరను కిలో రూ.200కు పెంచి వినియోగదారుల జేబులకు చిల్లులు పొడిచారు. ఈ ధరలు చూసి పేద, మధ్య తరగతి ప్రజలు రంజాన్‌రోజు కూడా పొదుపుగానే మాంసం వినియోగించారు. మార్కాపురం పట్టణంలో అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో మాంసం వ్యాపారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. అంతేగాక నాణ్యతలేని మాంసాన్ని కూడా పండుగ రోజులలో కలిసి విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వాయిపాలెం - గురిజేపల్లి గ్రామ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమయ్యింది. ఎస్సై పి చౌడయ్య తెలిపిన వివరాల మేరకు జాతీయ రహదారి వెంట ఉన్న మైదాన ప్రాంతంలో సోమవారం గుర్తుతెలియని మృతదేహం కనిపించింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 40-50 ఏళ్ల మధ్యన ఉంటుందని తెలిపారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

గంజివారిపల్లిలో పెద్దపులి కలకలం

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంజివారిపల్లి - కొలుకుల గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఆది, సోమవారం పెద్దపులి సంచరించినట్లు గ్రామ ప్రజలు తెలిపారు. అడవిలోకి మేత కోసం వెళ్లిన రెండు మూగ జీవాలు కనిపించడం లేదని పేర్కొన్నారు. ఈ విషయంపై అటవీశాఖ అధికారులు కెమోరాలను పరిశీలిస్తున్నారు. గ్రామంలోని ప్రజలతో ఫారెస్టు అధికారులు సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. అటవీ ప్రాంతంలోకి ఎవరు వెళ్లద్దని ఇన్‌చార్జ్ ఫారెస్టు రేంజర్ సుబ్బారావు తెలిపారు.

ఖబరస్థాన్ అభివృద్ధికి విరాళం



ప్రార్థనల్లో పాల్గొన్న కృష్ణకిషోర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు పట్టణంలో జరిగిన రంజాన్ వేడుకల్లో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సోదరుడు కృష్ణ కిశోర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈద్గా వద్ద ముస్లింలతో కలిసి సామూహిక ప్రార్థనల్లో పాల్గొని వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింల ఖబరస్థాన్ అభివృద్ధి కోసం లక్ష రూపాయల విరాళాన్ని ఆయన ప్రకటించారు.

వైద్యశిబిరానికి విశేషస్పందన



వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

మార్కాపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం వెళ్లి తిరుగు ప్రయాణంలో మార్కాపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్న కర్ణాటక భక్తుల కోసం ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పాదయాత్రగా కర్ణాటక భక్తులు అధిక సంఖ్యలో శ్రీశైలానికి వచ్చి వెళుతుంటారు. ఈ క్రమంలో రైల్వేస్టేషన్ వద్ద గజ్జలకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు సాయిచరణ్ ఆధ్వర్యంలో సిబ్బంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో ఇంచుమించు 1200 మంది భక్తులు వైద్యపరీక్షలు చేయించు కున్నారు. వారికి సుదీర్ఘ పాదయాత్ర సందర్భంగా భక్తులు పలువురు తీవ్ర ఒళ్లు నొప్పులు, జ్వరం, జలుబుతో ఇబ్బంది పడగా, ఈ వైద్యశిబిరం స్వాంతన చేకూర్చింది.

చీరల పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా భారతీయ జనతా మజ్దూర్ సెల్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక విశ్వసేవికట్రస్ట్ వృద్ధుల ఆశ్రమంలో ఉంటున్న వృద్ధురాళ్లకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు షేక్ ఖలీఫాతుల్లా, మజ్దూర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ సిద్దాంబీ, ఆదిల్ గ్రూప్ ఆఫ్ ఎండీ ఆదిల్ తదితరులు ఉన్నారు. అనంతరం స్థానిక సుజాతనగర్‌లోని మసీద్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందును వారు ఇచ్చారు.



మార్కాపురంలోని పెద్ద ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, దోర్నాల, పొదిలిలో ముస్లింల ప్రార్థనలు

భక్తిశ్రద్ధలతో రంజాన్

- ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలతో నిరసన

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నెలరోజుల ఉపావాస దీక్షల అనంతరం నెలవంక కనిపించగానే ముస్లింలకు పవిత్రమైన రంజాన్ పండుగను మార్కాపురం పట్టణంలో సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి ఆయా ప్రాంతాల నుంచి తగ్బీర్ చదువుతూ ఈద్గాల వద్దకు చేరుకున్నారు. పట్టణంలోని కంభం రోడ్డు పెద్దఈద్గా, నాగులవరం, తర్లుపాడు రోడ్డులలోని ఈద్గాలలో ఈద్‌నమాజ్ నిర్వహించారు. పెదఈద్గాలో ముఫ్తి మహమ్మద్ మిన్హాజ్ ఈద్ సందేశం ఇచ్చారు. కుద్బా చదివి ఈద్ నమాజ్ నిర్వహించారు. ఈద్గాలకు వెళ్లలేని వారి కోసం ఉదయం 7గంటలకు ఆయా మసీద్‌లలో ఈద్ నమాజ్ నిర్వహించారు. పట్టణంలోని మర్కస్ జామియా మసీద్‌లో ఆలిమ్ సాహెబ్, మొఘల్ అజ్మతుల్లా బేగ్ ఈద్ నమాజ్ చదివించి సందేశం ఇచ్చారు. ముస్లింలు ఈద్‌నమాజ్‌ల అనంతరం పేదలకు దానధర్మాలు చేశారు.

మార్కాపురం వన్‌టౌన్ : కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ మార్కాపురం పట్టణంలో ముస్లింలు సోమవారం రంజాన్ రోజున చేతులకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలు మాట్లాడుతూ.. ముస్లింల హక్కులను కాలరాసే విధంగా కేంద్రం వక్ఫ్ సవరణ బిల్లును తీసుకొస్తుందన్నారు. ముస్లిం సమాజం బిల్లుకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు.

పొదిలి : రంజాన్ సందర్భంగా సోమవారం ఉదయాన్నే చిన్నలు, పెద్దలు బుగ్గచలం వాటర్ ట్యాంక్ సమీపంలో ఉన్న ఈద్గాకు పెద్దఎత్తున ప్రార్థనలు చేశారు. అనంతరం మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల ఫొటోగ్రాఫర్, వీడియోగ్రాఫర్‌ల ఆధ్వర్యంలో శీతలపానియాల ఏర్పాటు చేశారు.

పెద్దదోర్నాల : పట్టణంలోని ముస్లింలు రంజాన్ సందర్భంగా ఐక్యంగా ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

త్రిపురాంతకం : ముస్లిం సోదరులు రంజాన్ పండుగను సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని వెల్లంపల్లి, దూపాడు, మేడపి గ్రామాలతో పాటు మండల కేంద్రమైన త్రిపురాంతకంలో ముస్లింలు రంజాన్ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొని దానధర్మాలు చేశారు.

కంభం : కంభం, అర్ధవీడు మండలాల్లో సోమవారం ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నమాజ్ చేస్తూ పవిత్రమైన ఖురాన్ గ్రంథంలో ఉన్న విలువలను పాటించిన వారు ఆది వారం నెలవంక కనిపించగానే సోమవారం ఉపవాస దీక్షలు విరమించారు. ప్రార్థనల అనంతరం ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కంభం ఎస్సై నరసింహారావు, అర్ధవీడు ఎస్సై నాయక్ ఈద్గాల వద్ద శాంతిభద్రతలు పర్యవేక్షించారు.

ఎర్రగొండపాలెం : పట్టణంలోని ఈద్గా మైదానం వద్ద ముస్లింపెద్దలు, యువకులు, సోమవారం ప్రత్యేకంగా నమాజ్ చేసి దువా చేశారు. జామియా మసీదు మౌలానా హిదయతుల్లా ప్రత్యేక నమాజ్, దువా చేశారు. పట్టణంలో ఐదు మసీదుల ముస్లిం పెద్దలు పాల్గొని దువా, నమాజ్ చేసి అందరికీ మంచి జరగాలని ప్రార్థనలు చేశారు. ముస్లింలకు ఎర్రగొండపాలెం లోని ఈద్గా మైదానం వద్ద ప్రార్థనల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎర్రగొండపాలెం లోని ఈద్గా మైదానం వద్ద ముస్లింలు చేపట్టిన దువా, నమాజ్ ముగిసిన అనంతరం జడ్పీమాజీ ఉపాధ్యక్షులు డాక్టరు మన్నె రవీంద్ర, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం ఈద్‌ముబారక్ తెలిపారు.

కొమరోలు : రంజాన్ సందర్భంగా కొమరోలు పెద్ద మసీదు నుంచి ప్రధాన రహదారుల మీదగా ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోరుమామిళ్ల రోడ్డులోని ఈద్గా వద్ద మత పెద్ద పవిత్ర గ్రంథమైన ఖురాన్‌ను పఠించి అందులోని సూక్తులను తెలియజేశారు. ప్రతివ్యక్తి శాంతి, సహనం, కరుణ వంటివి చూపాలన్నారు. సంపాదనలో కొంత భాగాన్ని పేదలకు పంచి పెట్టాలన్నారు. గిద్దలూరు సీఐ రామకోటయ్య, ఎస్సై నాగరాజులు ప్రత్యేకంగా పర్యవేక్షించారు.

తర్లుపాడు : మండలంలోని తుమ్మలచెరువు, తర్లుపాడు, మీర్జపేట, గానుగపెంటలో పవిత్రమైన రంజాన్ పండుగను ముస్లింలు సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు, ఖురాన్ పఠనం, ప్రార్థనలతో రంజాన్ పండుగ వేడుకలను జరుపుకున్నారు. తర్లుపాడు, తుమ్మలచెరువు ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తర్లుపాడులో అబ్దుల్ రహీమ్ ప్రత్యేక నమాజ్ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ యువ నాయకులు కందుల రోహిత్ రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, మండల యూత్ అధ్యక్షులు మేకల వెంకట్‌లు ఈద్గాల వద్దకు వెళ్లి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

గిద్దలూరు టౌన్ : మండలంలోని ముస్లింలు సోమవారం రంజాన్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేశారు. గిద్దలూరులోని నంద్యాల రోడ్డు నందు గల ఈద్గా వద్ద సామూహికంగా ప్రార్థనలు చేశారు. అలాగే కొంగళవీడు రోడ్డు, గ్రామాలలోని ఈద్గాల వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. రంజాన్ పర్వదినం ప్రాముఖ్యత ముస్లిం మత బోధకులు వివరించారు. కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు.

గిద్దలూరు పోలీసులు ఫ్రెండ్లీ పోలీసింగ్ కాన్సెప్టను కొనసాగిస్తూనే ఉన్నారు. అర్బన్‌సీఐ సురేష్, పోలీసు సిబ్బంది రంజాన్ వేడుకల్లో పాల్గొని సామూహిక ప్రార్థనలు చేసిన ముస్లింల వద్దకు వెళ్లి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



మార్కాపురంలో వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలతో నిరసన, గిద్దలూరులో నల్లబ్యాడ్జీలతో ప్రార్థనలు, ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎరిక్షన్‌బాబు, మన్నెరవీంద్రలు

నాటి వైసీపీ పాలన పాపం - రాళ్లవాగుకు శాపం

కూటమి పాలనపైనే రైతుల ఆశలు



ప్రస్తుత రాళ్లవాగు పరిస్థితి

కంభం (అర్ధవీడు), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అర్ధవీడు మండలం నల్లమల అటవీ ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన రాళ్లవాగుకు జగన్‌పాలన శాపంగా మారింది. టీడీపీ హాయంలో ఈ పనులు ప్రారంభమైనప్పటికీ, వైసీపీ హయాంలో పూర్తిగా నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై దీని నిర్మాణ బాధ్యత ఉంది.

నల్లమల అటవీ ప్రాంతమైన పాపినేనిపల్లె వద్ద అంకభూపాలెం పంచాయతీ సమీపంలోని రెండు కొండల మధ్య సహజసిద్ధంగా రాళ్లవాగు ఆనకట్ట నిర్మించాల్సి ఉంది. రూ.22 కోట్లతో దీని నిర్మాణ పనులు టీడీపీ హయాంలో ప్రారంభించారు. వెలిగొండ ప్రాజెక్టు అనుబంధ ప్రాజెక్టుగా దీని పనులు ప్రారంభించారు. టీడీపీ హయాంలో పునాదులు వేసి పనులు ప్రారంభించారు. అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దీని గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆనకట్ట నిర్మాణం పూర్తయితే 1500 ఎకరాలకు సాగు, 12 గ్రామాలకు తాగునీరు లభిస్తుంది. 0.138 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో జలాశయం అర్ధవీడు మండలానికి వరంగా మారుతుంది. కానీ అధికారులు, పాలకుల నిర్లక్ష్యం తోడై గత ప్రభుత్వ హయాంలో కనీసం తట్టమట్టి కూడా పోయలేదు. మట్టి, ఇసుక, రాళ్ల కొరతను చూపి పనులను పక్కనపెట్టారు. ఈ ఆన కట్ట నిర్మాణం పూర్తయితే ఐదేళ్లలో రాళ్లవాగుకు వచ్చిన వరదలతో జలాశయం నిండుకుండాల ఉండేది.

ముడిసరుకు సరఫరా చేయలేక

పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు అనుసంధానంగా ఈ ఆనకట్ట నిర్మాణానికి స్థానిక నాయకులే కాంట్రాక్టర్లుగా ఉన్నారు. ముడి సరుకుకు తగిన ధరలకు ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో జలాశయ నిర్మాణానికి అవసరమైన మట్టి, ఇసుక, రాళ్ల సరఫరా చేయకపోవడం, కాంట్రాక్టర్‌లు సబ్‌కాంట్రాక్టర్‌కు పనులు కేటాయించడంతో ఆనకట్టు పనులు నాలుగేళ్లుగా పునాది దశలో ఆగిపోయాయి. నల్లమల అడవుల నుంచి ప్రవహించే నీరు రాళ్లవాగు ఆనకట్ట పూర్తి కాకపోవడంతో వరద నీరు జంపలేరువాగు నుంచి వృథాగా పోతోంది. ఆనకట్ట నిర్మాణం పూర్తయితే, వరద నీరు మిగిలి భూగర్భ జలాలు పెరిగేవి. కూటమి ప్రభుత్వం రాకతో రాళ్లవాగు ఆనకట్ట నిర్మాణం పూర్తిచేసి తాగు, సాగు నీటి అవసరాలు తీర్చాలని అర్ధవీడు మండల ప్రజలు కోరుతున్నారు.

తురిమెళ్లలో గోశాల ప్రారంభం



గోశాలను ప్రారంభిస్తున్న మాజీసర్పంచ్ వీరమ్మ

కంభం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2.30లక్షల వ్యయంతో కంభం మండలం తురిమెళ్ల గ్రామంలో నిర్మించిన గోశాలను తురిమెళ్ల మాజీ సర్పంచ్ నారిశెట్టి వీరమ్మ ప్రారంభించారు. అక్కడి ఆవులను పూజించి శాలువా వేసి సత్కరించారు. కంభం శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం వారు ఆవులకు పచ్చిమేత తినిపించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు తోట కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షులు కాసుల పాండు, పులి శ్రీనివాస ప్రసాద్, ఉపాధ్యక్షులు సూరె ప్రసాద్, నారిశెట్టి కరుణాకర్, మామిళ్ల చంద్రశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వసంత నవరాత్రులు


గిద్దలూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బద్వేల్ రోడ్డులోని రామాలయంలో వసంత నవరాత్రుల కార్యక్రమం వైభవంగా జరుగుతోంది. దీనిలో భాగంగా సోమవారం స్వామి వారు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గోళ్ల సుబ్బరత్నం, మరియాల సర్వేశ్వర్‌రావు, జి.శ్రీనివాసులు దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. చిన్నారులకు భక్తిగీతాల పోటీలు నిర్వహించారు. విజేతలకు మోటపోతుల రాంభూపాల్‌రావు బహుమతులు అందజేశారు. ఆయా పూజా కార్యక్రమాలలో దేవస్థాన కమిటీ ప్రతినిధులు విటా సుబ్బరత్నం, చీతిరాల నాగార్జునరావు, రాచపూటి నరసింహారావు, శివపురం వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

పొదిలిలో నత్తనడకన కందుల కొనుగోళ్లు

- అధికారులు, నేతల మధ్య సమన్వయలోపం
- వేగం పెంచాలని రైతుల వేడుకోలు

పొదిలి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు దళారి వ్యవస్థ నిర్మూలించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు నేతలు, అధికారుల మధ్య సమన్వయలోపంతో వెలవెలబోతున్నాయి. మండలంలోని ఉప్పలపాడు, మదాలవారిపాలెం సహకార సంఘాలకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను మంజూరు చేసింది. ఉప్పలపాడులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో అరకొరగా సాగుతున్నప్పటికీ మాదాలవారిపాలెం కొనుగోలు కేంద్రంలో కందుల కొనుగోళ్లు ప్రారంభమైనా పంట ను అమ్ముకోవడానికి రైతులు ముందుకురావడం లేదు. నిర్వాహకుల లోపమో తెలియడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. దీంతో కందిసాగు చేసిన రైతులు కందుల కొనుగోళ్లు వేగవంతం చేయాలని ముక్తకంఠంతో వేడుకుంటున్నారు. మండలంలో 8వేల మంది రైతులు రూ.25713 ఎకరాల్లో కందిసాగు చేశారు. రూ.50,586 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పంట చేతికివచ్చే సమయానికి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడడంతో పంట గణనీయంగా తగ్గిపోయింది. దీనికితోడు చీడ పీడలు ఉధృతి కారణంగా పెట్టుబడి ఖర్చులు పెరిగాయి. దీంతో రైతులు నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యం లో కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో కందులు క్వింటాకు రూ.7550 మద్దతుధర నిర్ణయించింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తూ ప్రక్రియను వేగవంతం చేయాల్సిఉన్నా, ఆ దిశగా కృషి జరగడం లేదు. ఉప్పలపాడు కేంద్రంలో వారంరోజులుగా కొనుగోలు సాగుతున్నప్పటికీ ఆశించిన వేగం లేదు. దీంతో అన్న దాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పొదిలిలో కొనుగోళ్లను వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చలివేంద్రాలు ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

గిద్దలూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు వేసవి తీవ్రత పెరుగుతుండడంతో పాదాచారులకు తాగునీటి కష్టాలు తీర్చేందుకు వివిధ సంస్థలు చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయి. పట్టణంలోని రేడియోబావి కూడలిలోని అభయాంజనేయస్వామి దేవస్థానం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవి పూర్తయ్యేంత వరకు చలివేంద్రాన్ని కొనసాగిస్తామని అధ్యక్షులు సూరె నాగేశ్వరరావు తెలిపారు. కాగా పెద్దబజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణలో చలివేంద్రాన్ని దేవస్థాన కమిటీ అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ ప్రారంభించారు. కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 40 మంది విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

మార్కాపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక తర్లుపాడు రోడ్డులోని జార్జి ఫార్మసీ కళాశాలలో సోమవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 40 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వై.రాజా జయరాం తెలిపారు. కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో దివిస్ ల్యాబరేటరీస్ సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఆ సంస్థకు చెందిన హెచ్‌ఆర్ మేనేజర్ హరికృష్ణ విద్యార్థులకు రాత, ఓరల్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. జార్జితోపాటు పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు విద్యతోపాటు వృత్తి అవకాశాలను అందించడంలో జార్జ్ కళాశాల ముందుంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ వై.సునీత, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ కె.అశోక్‌బాబు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలు సబ్‌డివిజన్‌లో 30 పోలీసు చట్టం

- డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు క్రైం, మార్చి31 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఒంగోలు సబ్‌డివిజన్‌లో 30 పోలీసు చట్టం అమలు చేస్తు న్నట్లు డీఎస్పీ ఆ ర్.శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు ఈ చట్టం అమలులో ఉంటుంద న్నారు. పోలీసుల అనుమతి లేనిది సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు చేయకూడదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కరువు మండలంగా పుల్లలచెరువు

పుల్లలచెరువు, మార్చి31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే వెనుకబడిన మండలమైన పుల్లలచెరువు మండలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించింది. సోమవారం రాష్ట్ర స్పెషల్ సెక్రెటరీ ఆర్.పి.సిసోడియా కరువు మండలాల జాబితాలో పుల్లలచెరువు మండలాన్ని చేర్చారు. దీంతో ఈ మండలంలో ఉపాధి హామీ పనిదినాలు అదనంగా పెరుగుతాయి. మంచినీటికి అదనపు నిధులు మంజూరు అవడం, రైతులు పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు పరిహారం, ఫసల్‌బీమా వర్తింపు తదితర ప్రయోజనాలున్నాయి.

వైభవంగా కాటంరాజు స్వామి తిరునాళ్ల

దర్శి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టువారిపల్లి గ్రామంలో సోమవారం కాటంరాజు తిరునాళ్ల వైభవంగా జరిగింది. టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ కాటంరాజుకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మారెళ్ల వెంకటేశ్వర్లు, దారం సుబ్బారావు, సానె సుబ్బయ్య, అంకయ్య, కర్నా శ్రీను, జనసేన నాయకుడు కుప్పాల పాపారావు తదితరులు పాల్గొన్నారు. తిరునాళ్ల సందర్భంగా రెండు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు

ఉగాది సప్తాహాలు

కురిచేడు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని కొండమీద వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గత ఐదే రోజుల నుంచి ఉగాది సప్తాహాలు జరుగుతున్నాయి. ఆలయ కమిటీ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ తీర్థ ప్రసాదాలు అందిస్తున్నారు. 5వ రోజున నక్షత్ర హారతితో స్వామివారికి నివేదన సమర్పించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటుచేస్తున్నారు. ఉగాది సప్తాహ కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు.

పాస్టర్ మృతి కేసు సీబీఐకి అప్పగించాలి

కురిచేడు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ మృతి కేసును సీబీఐకి అప్పగించాలని కురిచేడు మండల పాస్టర్లు, క్రైస్తవ సోదరులు డిమాండ్ చేశారు. సోమవారం పంచాయతీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో మానవహారం ఏర్పాటుచేసి ప్రవీణ్ మృతి కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో షేక్ ఖాసిం, రవి కుమార్, నిమ్మేష్, ప్రభాకర్, హనోకు, గురవయ్య, రాజశేఖర్, కె.జోసెఫ్, దాసు, మాణిక్యాలరావు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ కార్యక్రమానికి తరలిరావాలి

పామూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కనిగిరి నియోజకవర్గ ప్రగతి కోసం అంకుఠిత దీక్షతో శ్రమిస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డికి అండగా ఉండాలని టీడీపీ నియోజకకవర్గ నాయకుడు యారవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పీసీపల్లి మండలం దివాకరపల్లి గ్రామంలో బుధవారం రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్‌కు భూమిపూజ జరగనుంది. ఈకార్యక్రమంలో పామూరు మండలం నుంచి అధిక సం ఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇందుకుసంబంధించి మండలంలోని పడమటకట్టకిందపల్లి గ్రామంలో సోమవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, మంత్రులు డోలా బాలాంజనేయస్వామి, గొట్టిపాటి రవి కుమార్, ఎమ్మెల్యే ఉగ్రతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొంటున్నారని ఆయన పేర్కొన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు

పామూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పీసీపల్లి మండలంలో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుతో ఈప్రాంతానికి మహర్దశ పట్టడమేగాక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయని ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పేర్కొన్నారు. భూమి పూజకు సంబంధించిన ఏర్పాట్ల పనులను సోమవారం దివాకరపల్లిలో ఎమ్మెల్యే దాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు.

ఈసందర్భంగా మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గ అభివృద్ధికి ఉగ్ర చూపుతున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బైరెడ్డి జయరామిరెడ్డి, చండ్రా ఉమామహేశ్వర రావు, కావిటి సుబ్బయ్య, బొమ్మనబోయిన వెంగయ్య, వెంకటాద్రి, తోడేటి గోపి, బొబ్బూరి రమేష్, మన్నెపల్లి శ్రీను, శ్రీనివాసవర్మ, రాహుల్‌యాదవ్, వై. రాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్.. భౌ భౌ

ముండ్లమూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రి 7 గంటలు దాటితే కుక్కలు రోడ్లపైకి వచ్చి వాహన చోదకుల వెంట పడుతున్నాయి. వృద్ధులు, చిన్నారులను కరుస్తున్నాయి. దీంతో ఇళ్ళలో నుంచి బయటకు రావాలంటే హడలెత్తిపోతున్నారు. వాహన చోదకుల వెంట పడుతుండటంతో కరుస్తాయనే భయంతో వేగం పెంచి వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

మండలంలోని ఈదర, పూరిమెట్ల, ఉమామహేశ్వర అగ్రహారం, తమ్మలూరు, పసుపుగల్లు, పెద ఉల్లగల్లు, కెల్లంపల్లి, వేముల, కమ్మవారిపాలెం గ్రామాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. సాయంత్రం 7 నుంచి 9 గంటల వరకు గుంపులు గుంపులుగా వీధుల్లో తిరుగుతూ వాహన చోదకుల వెంట పడుతున్నాయి. ఇటీవల చాలా మంది కుక్క కాటుకు గురయ్యారు. మరికొంత మంది వేగంగా వెళ్ళి వాహనం అదుపు చేయలేక కిందపడి గాయాలపాలయ్యారు. చిన్న పిల్లలు వీధుల్లో వస్తే వెంటపడి కరుస్తున్నాయి. మూగ జీవాలైన గొర్రెలు, మేకలను సైతం కరుస్తున్నాయి. సంబంధిత పంచాయతీ అధికారులు శునకాలను పట్టుకొనే వారిని పిలిపించి సుదూర ప్రాంతాల్లో వదిలి పెట్టే విధంగా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు



పామూరులో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పామూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ వేడుకలను సోమవారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక సీఎస్‌పురం రోడ్డులో గల ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నమాజ్ అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మండలంలోని పలుగ్రామాల నుంచి సుమారు మూడు వేల మంది ఈద్గా మైదానంలో జరిగిన రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మసీదుల్లో కూడా రంజాన్ ప్రార్థనలు జరిగాయి. పామూరుతో పాటు మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సీఎస్‌పురం మండలంలోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు నమాజ్‌లో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, పలువురు ముస్లిం నాయకులు వక్ఫ్ బోర్డు పరిరక్షణకు నడుంబిగించి చట్టసవరణ బిల్లు ఆమోదానికి నిరసనగా నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు.



రంజాన్ వేడుకల సందర్భంగా దర్శిలోని ఈద్గాలో కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, టీడీపీ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్

ముండ్లమూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ముస్లిం సోదరులు రంజాన్ పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనేక మంది హిందువులు ముస్లింకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

కురిచేడు: కురిచేడులోని వినుకొండ రోడ్డులో ఈద్గా వద్ద, పడమర నాయుడుపాలెం, కల్లూరు గ్రామాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కురిచేడు ప్రధాన కూడలి నుంచి ముస్లిం సోదరులు వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు.

తాళ్లూరు: మండలంలోని పలుగ్రామాల్లో రంజాన్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తూర్పుగంగవరం గ్రామంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

దొనకొండ: రంజాన్ పర్వదిన సందర్భంగా ముస్లింలు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గా వద్దకు వచ్చిన పేదలకు దానధర్మాలు చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు నిరసన వ్యక్తం చేస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించారు.

దర్శి: రంజాన్ వేడుకలు సోమవారం మండలంలో ఘనంగా జరిగాయి. ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్శి పట్టణంలోని కురిచేడు రోడ్డులోని ఈద్గాలో ముస్లింలతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ ప్రార్థనలు చేశారు. ఒకేసారి ఈద్గా వద్దకు వెళ్లటంతో అనుకోకుండా ఇరువురు కలిశారు. ముస్లిం పెద్దలతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా ఇరువురు ఆప్యాయంగా పలకరించుకున్నారు.

ఈసందర్భంగా డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ దర్గా అభివృద్ధికి రూ.2 లక్షలు విరాళం ప్రకటించారు. గతంలో ఈద్గా అభివృద్ధి కోసం రూ.7.86 లక్షలు అందించిన విషయం తెలిసిందే. అదేవిధంగా ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి తమ ట్రస్టు నుంచి రూ.5 లక్షలు ఈద్గా అభివృద్ధికి కేటాయిస్తామని ప్రకటించారు.

ముస్లింల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సర్వమానవాళి సమానత్వమే రంజాన్ పండుగ అని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పట్టణంలోని పెద్దచెరువు వద్ద ఉన్న ఈద్గాలో సోమవారం జరిగిన పార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ రంజాన్ ప్రార్థనల్లో పాల్గొనటం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ముస్లింల అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం అందిస్తానని చెప్పారు. వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ప్రవిత్ర రంజాన్ నుంచి ప్రతి ఒక్కరూ అల్లా చూపిన మార్గంలో నడుస్తూ శాంతి సమాజం కోసం పాటు పడాలన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అల్లాను ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, సీఐ ఖాజావలి, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు అహ్మద్, టీడీపీ నాయకులు ఫిరోజ్, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, నజీముద్దీన్, తమ్మినేని వెంకటరెడ్డి, పీర్ల మస్తాన్‌వలి, రోషన్ సంధాని, గుడిపాటి ఖాదర్, రిజ్వాన్, జంషీర్, మాజీ కౌన్సిలర్ జిలాని తదితరులు పాల్గొన్నారు. అలాగే, పట్టణ సమీపంలోని శంఖవరం ఈద్గాలో ముస్లింలు అత్యధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

ప్లాస్టిక్ నిషేధ ప్రచారంలో ఎన్జీవోల పాత్ర అభినందనీయం

- మంత్రి గొట్టిపాటి రవికుమార్

కనిగిరి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధ ప్రచారంలో ఎన్జీవోలు నిర్వహిస్తున్న పాత్ర అభినందనీయమని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఎమ్మెల్యేలు డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో తయారుచేసిన జనపనార సంచులను సోమవారం మంత్రి చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో ప్రకృతిని ప్రేమించండి.. పర్యావరణాన్ని కాపాడండి అనే నినాదంతో ప్లాస్టిక్ నిషేధంపై వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారన్నారు. ప్రపంచ మానవాళికి ప్రాణహాని తలపెట్టే ప్లాస్టిక్ వాడకంతో జరిగే అనర్థాలను ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉద్యోగులు ఆదర్శంగా నిలవటం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎన్జీవో సంఘం అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, కార్యదర్శి షేక్ హజరత్ ఆలీ, జక్రయ్య, కిరణ్‌కుమార్, అరవింద పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు తమ్మినేని పెద్దిరెడ్డి, నాగభూషణం, చెన్నయ్య, టీడీపీ నాయకులు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, సిద్ధాంతి బారాయిమాం, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



జనపనార సంచులను పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యేలు డాక్టర్ ఉగ్ర, అశోక్‌రెడ్డి

వైట్‌బర్లీ రైతుల వెతలు

- తేమ శాతంతో వెనక్కి పంపిస్తున్న వ్యాపారులు
- ఎక్కువ రోజులు నిల్వఉంటే రంగుమారే ప్రమాదం
- ఇబ్బందులు పడుతున్నవైనం

ముండ్లమూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వైట్‌బర్లీ పొగాకు సాగు చేసిన రైతులకు అమ్ముకోవటానికి అష్టకష్టాలు పడుతున్నారు. పండించిన పొగాకు చెక్కులు కంపెనీలకు తీసుకువెళితే ఐటీసీ, జీపీఐ, ఎలైన్ కంపెనీల నిర్వాహకులు తేమ శాతంతో వెనక్కి పంపిస్తున్నారు. దీంతో రైతులు పొగాకు అమ్ముకోవటానికి నానా తంటాలు పడుతున్నారు.

ఈ ఏడాది పదివేల ఎకరాల్లో వైట్‌బర్లీ సాగు చేశారు. గత నెల రోజుల నుంచి ముమ్మరంగా దిగుబడులు వచ్చాయి. పొలాల్లో, ఇళ్ళ వద్ద ఆకును ఎండబెట్టి బేళ్ళు కట్టి మేదరమెట్ల, చిలకలూరిపేట, బొప్పూడి, ఒంగోలుతో పాటు పెదఉల్లగల్లు, ముండ్లమూరు ప్రాంతాల్లో ఉన్న వివిధ కంపెనీలకు తీసుకెళుతున్నారు. అక్కడ వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్న బయ్యర్లు తేమ శాతం ఉంది, చెక్కులు వెనక్కి తీసుకువెళ్ళండంటూ చెపుతున్నారు. రైతులు గట్టిగా ప్రశ్నిస్తే మీరు తెచ్చిన పొగాకు బేడ్లు ఏ గ్రేడు కాదని, పైపెచ్చు బాగా నెమ్ము శాతం ఉందని చెప్పి వెనక్కి పంపుతున్నారు. ఒక్కో రైతు పది నుంచి 20 చెక్కులు ట్రాక్టర్లలో తీసుకువెళ్ళి రెండు రోజుల పాటు ఆయా కంపెనీల వద్ద ఉన్నా చివరికి మీరు ఇంటికి తీసుకెళ్లాలని చెబుతుండటంతో చేసేదేమి లేక వెనక్కి తీసుకు వెళ్తున్నారు. పండించిన పంటను ఇళ్లవద్ద రోజుల తరబడి ఉంచుతున్నారు. ఆరు గాలం కష్టపడి పండించిన పంటను మార్కెట్‌లో అమ్ముకోవటానికి ఎంత కష్ట పడాల్సి వస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని నాయుడుపాలెం, తమ్మలూరు, పూరిమెట్ల, భీమవరం, ఉమామహేశ్వర అగ్రహారం, మారెళ్ళ సుంకరవారిపాలెం, పసుపుగల్లు, చింతలపూడి, శంకరాపురం, పోలవరం, నూజెండ్లపల్లి, రామకృష్ణాపురం, కమ్మవారిపాలెం, వేముల, కొమ్మవరం, ఈదర, వేంపాడు గ్రామాల్లో వైట్ బర్లీ పొగాకును అత్యధికంగా సాగు చేశారు. ప్రస్తుతం దిగుబడి ఎకరానికి ఎనిమిది నుంచి పది క్వింటాళ్ళు వస్తుంది. రేటు కూడా రూ .15 వేల నుంచి రూ.15,500 ఉండటంతో రైతులు కొంత ఆనందంగా ఉన్నా అమ్ముకోవటానికి వచ్చేసరికే చుక్కలు కనపడుతున్నాయి.

వారాల తరబడి చెక్కులు ఇళ్ళ వద్దే ఉండటంతో కొన్ని రంగు మారి నల్లగా వస్తున్నాయి. ఇది రైతులకు మరింత ఇబ్బందికరంగా మారింది. రైతు పండించిన ఒకటి రెండు చెక్కులు కొనుగోలు చేసి మిగతా చెక్కులు తేమ శాతం ఎక్కువగా ఉందని వ్యాపారులు వెనక్కి పంపుతున్నారు. దీంతో ఈఏడాది కష్టాలు తప్పేటట్టులేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పొగాకు పంటను కొనుగోలుచేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



వైట్‌బర్లీ పొగాకు చెక్కులు



పసుపుగల్లులో రైతు పొలంలో ఎండబెట్టిన వైట్‌బర్లీ పొగాకు

రెండు సార్లు వెనక్కి పంపారు

- గొర్రె రాముడు, నాయుడుపాలెం

నాలుగు ఎకరాల్ల వైట్‌బర్లీ పొగాకు సాగు చేశాను. 15 రోజుల క్రితం చెక్కులు తీసుకొని కంపెనీకి వెళితే తేమ శాతం ఎక్కువగా ఉందని ధర వేయకుండా వెనక్కి పంపించారు. చేసేదేమి లేక ఇంటికి తీసుకొచ్చాం. అధికారులు జోక్యం చేసుకొని కొనుగోలు చేసే విధంగా చూసి ఆదుకోవాలి.

పేదరికంలేని సమాజమే ప్రభుత్వ లక్ష్యం

దర్శి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పీ-4 విధానం ఎంతో ఉపయోగపడుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ఎంతో ముందుచూపుతో పీ-4ను ఆచరణలోకి తీసుకురావటం ఆనందదాయకమన్నారు. ఎంతో అనుభవం కల్గిన సీఎం చంద్రబాబు ఆలోచన దేశానికే మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. 2047 నాటికి పేదరికం లేని సమాజం నిర్మించటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. పీ-4 అమలుతో భవిష్యత్తులో పేద ప్రజలను గుర్తించి ప్రభుత్వంతో పాటు సంపన్న వర్గాల ద్వారా చేయూతనిచ్చి అభివృద్ధి చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ బృహత్కర కార్యక్రమంలో అందరూ బాగస్వాములు కావాలని ఆమె కోరారు.

భూమిపూజ ఏర్పాట్ల పరిశీలన

పీసీపల్లి, మార్చి 31: మండలంలోని వెంగళాయపల్లి పంచాయతీ దివాకరపల్లి సమీపంలో బుధవారం భూమిపూజ చేయనున్న రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ స్థలాన్ని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిలతో కలిసి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిశీలించారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ గోపాలక్రిష్ణ ఆధ్వర్యంలో జరిగిన అధికారుల సమీక్షా సమావేశంలో మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భూమిపూజ కార్యక్రమంలో ఎక్కువమంది రైతులను భాగస్వామ్యం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, వెంగళాయపల్లి సర్పంచ్ కరణం తిరుపతయ్య, బత్తిన రాధాక్రిష్ణ, వివిధశాఖల జిల్లాస్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తిపై దాడి

కనిగిరి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కుటుంబకలహాల నేపథ్యంలో షేక్ ఖాశీం అనే యువకుడిపై దాడిచేయడంతో గాయపడ్డాడు. ఈఘటన సోమవారం రాత్రి స్థానిక ఒంగోలు బస్టాండు వద్ద సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం టకారిపాలెంకు చెందిన బాధితుడు(క్షతగాత్రుడు)కు ఒంగోలు బస్టాండు వద్ద మదీనా మసీదు వెనుక వీధిలో బంధువులు ఉన్నారు. మూడు రోజుల క్రితం క్షతగాత్రుడు బంధువులు ఇంటికి బైకుపై వెళ్తుండటంతో అదే వీధిలో నివాసం ఉంటున్న వారు అభ్యంతరం చెప్పగా గొడవపడ్డారు. ఇరువర్గాల పెద్దలు మాట్లాడి సర్దిచెప్పారు. సోమవారం రాత్రి బాధితుడు ఖాశీం ఒంగోలు బస్టాండు వద్దకు వచ్చిన సమయంలో వివాదం నెలకొంది. ఈక్రమంలో కొంతమంది యువకులు అతని తలపై ఇటుక రాయితో దాడిచేయడంత గాయపడ్డాడు. తీవ్ర రక్తస్రావంతో క్షతగాత్రుడు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స కోసం చేరగా ప్రాథమిక చికిత్స అందించారు. ప్రభుత్వాసుపత్రి వద్ద బాధితుడి బంధువులు(టకారిపాలెం) పెద్దఎత్తున చేరుకోవటంతో ఉద్రిక్త పరిస్థితి చోటు చేసుకుంది. సీఐ ఖాజావలి, ఎస్ఐ టి.శ్రీరాం ఆసుపత్రి వద్దకు చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

రూ.5 కోట్లతో ధ్యాన కేంద్రం, కల్యాణ మండపం

- కుమారుడి జ్ఞాపకార్థం నిర్మాణం



తూర్పుగంగవరంలో నిర్మిస్తున్న మణికంఠ యోగా ధ్యాన కల్యాణ వేదిక

తాళ్లూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుగంగవరం గ్రామానికి చెందిన గుజ్జుల సుబ్బారెడ్డి(సద్దల సుబ్బారెడ్డి) నిస్వార్థ సేవకు ఉపక్రమించారు. తాను సంపాదించిన ఆస్తిపాస్తులను కుమారుడు అనుభవించకుండా చిన్న వయస్సులోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో కలత చెందాడు. తనయుడి జ్ఞాపకార్థం ప్రజలకు తన చేతనైనంత సహాయం చేయాలని తలంచాడు. తనకు గల 2కోట్ల 50లక్షల విలువగల 84 సెంట్ల స్థలంలో కుమారుని పేరుతో గుజ్జుల మణికంఠారెడ్డి త్రిముఖ దేవాలయం, యోగా ధ్యాన వేదికను దాదాపు రెండున్నర కోట్లతో చేపట్టాడు. ఆభవనం విలువ ప్రస్తుతం రూ.5 కోట్లకు పైగానే ఉంటుంది.

ప్రజలు నిత్యం మానసిక వేదనతో ఇబ్బందులు పడుతున్నందున, మనస్సు ప్రశాంత కోసం యోగా ధ్యానం చేస్తే బాగుంటుందన్న యోచనతో ధ్యాన కేంద్ర నిర్మాణం తలపెట్టాడు. పైఅంతస్తులో యోగధ్యాన కేంద్రం నిర్మాణం పూర్తయింది. యోగా కేంద్రానికి వెళ్లే మార్గంలో ద్వారానికి ఇరువైపులా పరమశివుడు, బుద్ధుడు బొమ్మలు ఏర్పాటుచేశారు. గత కొంత కాలంగా ఆకేంద్రంలో గురుజీ శ్రీరాంజీ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రజలకు ఉచితంగా యోగాశిక్షణ ఇస్తున్నారు. ధాన్యకేంద్రం నిర్మిస్తున్న సమయంలో కొందరు స్నేహితులు కల్యాణ మండపం నిర్మించాలని సూచించారు. దీంతో దిగువ అంతస్తులో చేపట్టిన కల్యాణ మండప నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి.

ప్రజలకు సేవ చేయాలన్నదే లక్ష్యం

- గుజ్జుల సుబ్బారెడ్డి, తూర్పుగంగవరం



ప్రజలకు సేవ చేయాలన్నదే లక్ష్యం. మూడేళ్లక్రితం తన కుమారుడు చిన్నవయసులోనే మృతి చెందాడు. అతని జ్ఞాపకార్థం ప్రజలకు సేవచేయాలని తలంచాను. ధ్యాన కేంద్రం ఏర్పాటు చేయాలని తలంచి అత్యంత విలువైన 2కోట్ల 50లక్షల విలువగల 84సెంట్లభూమిలో భవనిర్మాణం తలపెట్టాను. కొందరు పేదవర్గాలకు సరైన అద్దెలకు కల్యాణ మండపాలు దొరకక తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. దీంతో కల్యాణ మండప నిర్మాణం చేపట్టాను. తాళ్లూరు ప్రాంతంలో ఎవరైనా పైసా చెల్లించకుండా కల్యాణ మండపంలో పెళ్లిళ్లు చేసుకోవచ్చు. ప్రజలకు తన వంతు సహాయం చేయాలన్న తలంపుతోనే ఈనిర్ణయం తీసుకున్నా.

పందుల స్వైరవిహారం

- పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నవైనం
- పట్టించుకోని పంచాయతీ పాలకులు, అధికారులు



దొనకొండలోని ఒక వీధిలో గుంపుగా పందులు

దొనకొండ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దొనకొండలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్లపై, జన నివాసాల చుట్టూ సంచరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఊరికి దూరంగా పెంచుకోవాలని నిబంధనలు ఉన్నప్పటికీ కొందరు పెంపకందారులు గ్రామంలో వదిలేస్తున్నారు. వీటి సంచారంతో ఎటువంటి వ్యాధులు ప్రబలుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ సిబ్బంది పలు వీధుల్లో చెత్తను తరలించకపోవటంతో అపరిశుభ్రం చేస్తున్నాయి. రోడ్లపై పరుగులు తీస్తూ ద్విచక్ర వాహనాలకు అడ్డుగా వస్తుండటంతో వాహనదారులు గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ఈవిషయమై పంచాయితీ అధికారులు విన్నవించినా ఎటువంటి ఫలితంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకొని కొందరు పెంపకందారులు వాటిని జన నివాసాల వద్ద వదిలేస్తున్నారు. వారికి అవసరమైనప్పుడు వాటిని తోలుకెళుతున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పెంపకందారులపై తగిన చర్యలు తీసుకొని, అవి జననివాసాల మధ్య సంచరించకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.




బాపట్లలో టీచింగ్ ఆసుపత్రి పూర్తి చేయాలి

బాపట్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : నిర్మాణంలో నిలిచిపోయిన బాపట్ల టీచింగ్ హాస్పటల్ పనులు ప్రారంభించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ సోమవారం మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. రేపల్లెలో జరిగే కార్యక్రమానికి హాజరైన మంత్రిని పార్టీశ్రేణులతో లక్ష్మీనారాయణ ఆయనను కలిశారు. బాపట్ల ప్రజల ఆరోగ్యభద్రతకు, వైద్య విద్యార్థులకు ఎంతో ప్రాముఖ్యత కలిగిన టీచింగ్ ఆసుపత్రిని త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రి ప్రాధాన్యత క్రమంలో ఏడాదిలో పనులు ప్రారంభించేవిధంగా చూస్తామని హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మామిడి రమేష్ తదితరులు ఉన్నారు.

పన్ను వసూలులో.. మున్సిపల్టీలు

- పురాల్లో పన్ను వసూలు 45.40 శాతమే
- లక్ష్యాల సాధనలో వెనుకంజ
- కలసి రాని 50 శాతం వడ్డీ రాయితీ
- పన్ను వసూలు లక్ష్యం రూ. 643.67 కోట్లు
- వసూలు చేసింది రూ. 292.24 కోట్లు
- ఇంకా బకాయిలు రూ. 351.43 కోట్లు
- రాష్ట్ర స్థాయిలో వినుకొండ ద్వితీయ.. అద్దంకి తృతీయ స్థానం
- అట్టడుగున చిలకలూరిపేట మునిసిపాల్టీ



ఆర్థిక సంవత్సరం ముగిసింది. పన్నుల వసూలుకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో మునిసిపాలిటీలు వెనుక బడ్డాయి. ప్రభుత్వం 50 శాతం వడ్డీ మాఫీ అవకాశం కల్పించినా కలసి రాలేదు. పన్ను చెల్లించేందుకు పురాల పౌరులు ముందుకు రాలేదు. అయితే గత ఏడాది కంటే 2.23 శాతం పన్ను వసూలు పెరిగింది. గత ఏడాది 43.17 శాతం పన్ను వసూలు కాగా ఈ ఏడాది 45.40 శాతం పన్ను వసూలైంది. ఆస్తి, తాగునీటి పన్ను వసూలు లక్ష్యం 643.67 కోట్లు కాగా, 292.24 కోట్లు పన్ను వసూలైంది. ఇంకా ఆస్తి, తాగునీటి పన్ను బకాయిలు భారీగా పేరుకుపోగా, రూ 351.43 కోట్లు పన్నులు వసూలు కావాల్సి ఉంది. పన్ను వసూలులో రాష్ట్ర స్థాయిలో వినుకొండ ద్వితీయ, అద్దంకి తృతీయ స్థానంలో నిలిచాయి. చిలకలూరిపేట మునిసిపాల్టీ అట్టడుగున ఉంది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసిపాల్టీల్లో రూ. 522.28 కోట్లు ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉండగా రూ 261.09 కోట్లు వసూలు చేశారు. నీటి పన్ను రూ 121.39 కోట్లు కాగా రూ 31.15 కోట్లు వసూలైంది. ఆస్తి పన్ను రూ 261.19 కోట్లు, తాగునీటి పన్ను రూ 90.24 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఆస్తి పన్ను 49.99 శాతం, నీటి పన్ను 25.66 శాతం వసూలైంది. పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట మునిసిపాల్టీలలో అస్తి పన్ను 40 శాతం లోపే ఉంది. పల్నాడు జిల్లాకు సంబంధించి మునిసిపాల్టీలలో రూ 77.03 కోట్లు పన్ను వసూలు చేయాల్సి ఉండగా రూ. 42.07 కోట్లు వసూలైంది. 54.61 శాతం ఆస్తి పన్ను వసూలు చేశారు. తాగునీటి పన్ను రూ . 22.37 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. నీటి పన్ను రూ. 7.07 కోట్లు వసూలు చేయగా వసూలు శాతం 31.60 గా ఉంది. వినుకొండ మునిసిపాల్టీ 82.22 శాతం ఆస్తిపన్ను వసూలు చేసి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి బకాయిలు భారీగా పేరుకుపోయాయి. వడ్డీ మాఫీ చేసినా బకాయిదారులు స్పందించ లేదు.

● గుంటూరు కార్పోరేషన్‌తో సహా జిల్లాలో రూ. 406.97 కోట్లు ఆస్తి పన్ను, రూ 91.83 కోట్లు నీటి పన్ను వసూలు లక్ష్యం కాగా ఆస్తి పన్ను రూ. 194.76 కోట్లు, నీటి పన్ను రూ. 21.77 కోట్లు వసూలు చేశారు. ఆస్తి పన్ను 47.86 శాతం, నీటి పన్ను 23.70 శాతం వసూలైంది. ఈ జిల్లాలో కేంద్ర ప్రభుత్వం కార్యాలయాలకు సంబంధించి దాదాపు 10 కోట్లు పన్ను బకాయి పేరుకుపోయింది. వీటి నుంచి పన్ను వసూలు కాలేదని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్యాలయాల పన్ను బకాయి రూ. 29 కోట్లకు పైగా ఉండగా నామమాత్రంగానే పన్ను వసూలైంది. గుంటూరు కార్పోరేషన్ పన్ను వసూలులో అలసత్వం వలన 41.96 శాతమే పన్ను వసూలైంది.

● బాపట్ల జిల్లాలో మునిసిపాల్టీలలో ఆస్తి పన్ను రూ 38.28 కోట్లు లక్ష్యం కాగా రూ 24.26 కోట్లు వసూలు చేశారు. నీటి పన్ను 7.18 కోట్లకు రూ 2.31 కోట్లు వసూలైంది. ఆస్తి పన్ను 63.39 శాతం, నీటి పన్ను 32.20 శాతంగా నమోదైంది. బాపట్ల మున్సిపాల్టీ మునిసిపాల్టీలో 48.76 శాతం మాత్రమే పన్ను వసూలు చేశారు. అద్దంకి మునిసిపాల్టీ 80.01 శాతం పన్ను వసూలు చేసి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది.

మునిసిపాలిటీల వారీగా ఆస్తి పన్ను వసూలు ఇలా..

మునిసిపాలిటీ	లక్ష్యం కోట్లలో	వసూలైన పన్ను కోట్లలో	శాతం
పల్నాడు జిల్లా :			
నరసరావుపేట	20.59	11.20	54.42
చిలకలూరిపేట	22.40	8.86	39.54
వినుకొండ	6.30	5.18	82.22
సత్తెనపల్లి	8.75	5.15	58.83
మాచర్ల	7.63	4.05	53.15
పిడుగురాళ్ళ	6.97	4.82	69.11
దాచేపల్లి	2.49	1.61	64.72
గురజాల	1.90	1.25	65.49
గుంటూరు జిల్లా :			
గుంటూరు	320.52	134.50	41.96
తెనాలి	30.07	18.20	60.54
మంగళగిరి, తాడేపల్లి	48.98	37.56	76.68
పొన్నూరు	7.40	4.98	67.30
బాపట్ల జిల్లా :			
రేపల్లె	6.57	4.85	73.85
బాపట్ల	12.90	6.29	48.76
చీరాల	13.69	9.04	66.08
అద్దంకి	5.12	4.09	80.01

నేడు కొత్త గొల్లపాలెంకు సీఎం చంద్రబాబు

- 1 నాలుగు నెలల వ్యవధిలో రెండోసారి జిల్లాకు
- 1 మరిన్ని వరాలపై జిల్లా వాసుల ఆశలు
- 1 పింఛన్ల పంపిణీలో పాల్గొని లబ్ధిదారులతో మాట్లాడనున్న ముఖ్యమంత్రి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

నాలుగు నెలల వ్యవధిలోనే జిల్లాకు రెండోసారి సీఎం చంద్రబాబు రానుండడంతో జిల్లాకు దక్కే వరాలపై ప్రజలు ఆశతో ఉన్నారు. గతేడాది డిసెంబరులో బాపట్ల వేదికగా జరిగిన పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ కార్యక్రమానికి హాజరైన సీఎం మంగళవారం మరోసారి జిల్లాకు రానున్నారు. పర్చూరు నియోజకవర్గం చినగంజాం మండల పరిధిలోని కొత్తగొల్లపాలెంలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్నారు. ఈ నేపథ్యం లో జిల్లాలో ఇప్పటికే ప్రారంభమైన పలు అభివృద్ధి పనులు, కీలకమైన ప్రాజెక్టులకు నిధులు మంజూరుతో పాటు ప్రతిపాదన దశల్లో ఉన్న వాటిని సాధించుకునే క్రమం, దశాబ్దాల తరబడి ఎలాంటి అభివృద్ధికి నోచుకోని తీర ప్రాంత గ్రామాల అభివృద్ధి తదితర అంశాలపై సీఎం కురిపించే హామీల జల్లుపై జిల్లా వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

నిధులు ఓకే....పారదర్శకంగా ఖర్చే కీలకం

సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.97.52 కోట్ల నిధుల విడుదలకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గత ప్రభుత్వం శంకుస్థాపనలకే పరిమితం చేసిన నిజాంపట్నం మండల పరిధిలోని దిండి ఆక్వాపార్కు నిర్మాణానికి కూడా రూ.88 కోట్ల నిధుల విడుదలకు అనుమతులు లభించాయి. కానీ ఈ నిధుల ఖర్చు విషయంలో పారదర్శకతే కీలకం కానుంది. ఆక్వా పార్కు నిర్మాణం విషయంలో భూ సేకరణ అంశం రెండేళ్ల నుంచి కొలిక్కి రావడం లేదు. ఆ విషయంలో ప్రభుత్వం దృష్టిసారిస్తేనే నిర్మాణం పట్టాలెక్కే అవకాశం ఉంది. జిల్లా అభివృద్ధికి గ్రోత్ ఇంజన్‌గా ఉపయోగపడే పర్యాటకం, ఆక్వా రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించడంతో పాటు పనులు త్వరితగతిన పూర్తి చేసే విషయంలో పక్కా యాక్షన్ ప్లాన్ ప్రకటన సీఎం నుంచి వస్తుందనే ఆశాభావాన్ని జిల్లా వాసులు వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో అధికసంఖ్యలో ఉండే చేనేత కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రాయితీ వరాలు, దాదా పు రూ.15 కోట్ల వ్యయంతో జరుగుతున్న కాలువల మరమ్మతుల పనులు, మోటుపల్లిని పర్యాటకంగా అభివృద్ధి చేయడం, పర్చూరు నియోజకవర్గ రైతులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న గుంటూరు ఛానల్ ఆధునికీకరణకు నిధుల విడుదలతో పాటు పనుల పురోగతిపై సీఎం ఆరా తీసే అవకాశం ఉంది.

సీఎం పర్యటించే మండలంలోనే...

అత్యంత కీలకమైన రెండు ప్రాజెక్టులకు చినగంజాం మండల పరిధిలోని మోటుపల్లే కేంద్రం అయ్యే అవకాశం ఉంది. ఓడల తయారీ క్లస్టర్‌తో పాటు గ్రీన్ ఫీల్డ్ పోర్టు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపడం, కేంద్రబృందం పర్యటించడం జరిగిన సంగతి తెలిసిందే. ఇటీవలే సదరు ప్రాజెక్టులకు సంబంధించి కేంద్రమంత్రులను సైతం రాష్ట్ర మంత్రి కలవగా సానుకూల స్పందన వచ్చినట్లు తెలిపారు. మంగళవారం సీఎం చంద్రబాబు పింఛన్ల పంపిణీకి హాజరయ్యే గ్రామం కూడా పర్చూరు నియోజకవర్గ పరిధిలోని చినగంజాం మండల పరిధిలోనే ఉండడం ఒక ఎత్తయితే ఇదే మండలంలో రెండు భారీ ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉండడంతో వాటిపై సీఎం చేసే ప్రకటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చినగంజాం మండలంలో 10 తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి రూ.18 కోట్లు ఖర్చు అయ్యే పనుల ప్రతిపాద నలను కూడా ఎమ్మెల్యే ఏలూరి సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు సమాచారం.

జిల్లా వ్యాప్తంగా 2,24,600 మంది లబ్ధిదారులు

జిల్లాలో పింఛన్లు అందుకునే వారి సంఖ్య 2,24,600 మంది కాగా రూ.96 కోట్లు ఇందుకు ఖర్చు అవుతోంది. వృద్ధాప్య పింఛన్లతో పాటు వితంతులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు ఇందులో ఉన్నారు.

సీఎం పర్యటన సాగేదిలా....

ఉదయం 11:10కి సీఎం చంద్రబాబు చినగంజాం మండల పరిధిలోని కొత్తగొల్లపాలెంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకోనున్నారు. 11:40కి అక్కడ నుంచి బయల్దేరి 11:45కి కొత్తగొల్లపాలెం గ్రామానికి చేరుకుంటారు. పింఛన్ అందుకుంటున్న ఇద్దరు లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి వారి యోగక్షేమాలు, ఆర్థిక స్థితిగతులు అడిగి తెలుసుకోనున్నారు. 12:25కి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శించడంతో పాటు రెండు ఎలక్ట్రిక్ స్కూటీలను దివ్యాంగులకు పంపిణీ చేయనున్నారు. మధ్యాహ్నం 12:35 కి ప్రారంభమయ్యే ప్రజావేదిక కార్యక్రమం 1:30కి ముగియనుంది. 1:40 నుంచి 2:10 వరకు ఉన్న సమయాన్ని రిజర్వ్ చేశారు. 2:15 నుంచి 3:35 వరకు పార్టీ శ్రేణులతో సమావేశం కానున్నారు. 3:40కి తిరిగి హెలిప్యాడ్‌కు చేరుకోనున్న సీఎం అక్కడ నుంచి 3:45కి బయల్దేరి సాయంత్రం 4:15కి ఉండవల్లిలోని నివాసానికి చేరుకోనున్నారు.



హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రులు పార్థసారథి, అనగాని, ఎమ్మెల్యేలు సాంబశివరావు, నరేంద్రవర్మ, కొండయ్య, కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడీ



బాపట్ల ఇస్లాంపేట ఈద్గా దగ్గర రంజాన్ ప్రార్థనలనుద్దేశించి మాట్లాడుతున్న జామియా మసీదు ఫేష్ ఇమామ్ ముఫ్తి మహ్మద్ ఆఫాక్

ఘనంగా రంజాన్

ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు

బాపట్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) పవిత్ర రంజాన్ పండుగను సోమవారం జిల్లా అంతటా ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేసిన పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా నూతన వస్త్రాలు ధరించి సంతోషంగా ఒకరినొకరు పలకరించుకుంటూ, అలింగనాలు చేసుకుంటూ సందడి చేశారు. అన్ని ఈద్గా మైదానాల వద్దకు పెద్ద సంఖ్యంలో చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పోలీసు శాఖ ఈద్గాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసింది. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండ ముందస్తు చర్యలు చేపట్టారు.

మహ్మద్ ప్రవక్త అడుగుజాడలలో పయనించాలని అప్పుడే ఉపవాస దీక్షలకు అర్థం ఉంటుందని జామియా మసీదు పేష్ ఇమామ్ ముఫ్తి మహ్మద్ ఆఫాక్ పేర్కొన్నారు. రంజాన్‌పండుగ సందర్భంగా సోమవారం ఉదయం బాపట్ల పట్టణంలోని ఇస్లాంపేట ఈద్గా వద్ద ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఫ్తి మహ్మద్ ఆఫాక్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రార్థనలు చేసి ముస్లిం సోదరులను ఉద్దేశించి మాట్లాడుతూ రంజాన్‌మాసంలో 30రోజులపాటు ఉపవాసదీక్షలుఉండేవారు తప్పనిసరిగా పేదలకు ధానం చేయాలన్నారు. పట్టణంలోని జమేదారుపేట ఈద్గా వద్ద కూడా ముస్లిం సోదరులు ఈద్-ఉల్-ఫితర్ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. బాపట్ల అంజుమన్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రహీమ్‌జానీ శుభాకాంక్షలు తెలిపారు.

రేపల్లెలోని ఎస్‌కే ఆరీఫ్ ఇంట్లో రెవెన్యూశాఖామంత్రి అనగానిసత్యప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు చేసి నియోజకవర్గంలోని ముస్లీంసోదరులకు రంజాన్‌శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం తేనేటివిందులో పాల్గొన్నారు.



రేపల్లె : 26వ వార్డులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్

అవీ..ఇవీ



స్వామివార్ల పంచలోహ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దాతలు

సీతారామలక్ష్మణ పంచలోహ విగ్రహాలతో గ్రామోత్సవం

తిమ్మరాజుపాలెం(పర్చూరు), మార్చి 31(ఆంధ్రజ్యోతి): పర్చూరు మండలం తిమ్మరాజుపాలెంలో సోమవారం శ్రీ సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం విగ్రహాలకు వేద మంత్రాలతో శాస్త్రయుక్తంగా సంప్రోక్షణ, హోమం, శుద్ధి చేసిన అనంతరం పర్చూరులోని శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయానికి అందజేశారు. శ్రీరామనవమి సందర్భంగా ఈ విగ్రహాలతో స్వామివార్ల కల్యాణ వేడుకలను నిర్వహించుకునే వీలుగా అందజేశామని విగ్రహదాతలు నర్రా రామయ్య, శిరీష దంపతులు తెలిపారు.



ముక్తేశ్వరంలో నిరసన తెలుపుతున్న ముస్లింలు

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

బల్లికురవ. మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ముస్లింల హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును ప్రవేశ పెట్టిందని, అందుకు నిరసనగా తాము మత పెద్దల ఆదేశాల మేరకు నిరసనలు చేపడుతున్నామని ముస్లింలు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో రంజాన్ పండగ సందర్భంగా గ్రామంలో ఉన్న ఈద్గా వద్దకు చేరిన ముస్లింలు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జీవో కాపీలతో నిరసనకు దిగారు. గ్రామ వీధులలో వెంట ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

యనమదల కార్యదర్శిపై ఫిర్యాదు

యద్దనపూడి(మార్టూరు,మార్చి31(ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలంలోని యనమదల గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీ నిధులను దారి మళ్లించారని వారం రోజుల క్రితం గ్రామస్థులు బాపట్లలో జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై డీపీవో సంబంధిత కార్యదర్శిని పిలిపించి విచారణ చేసినట్లు సమాచారం. గ్రామ కార్యదర్శి పంచాయతీ నిధులను తన పంచాయతీలో పనిచేసే స్వీపరు ఖాతాకు మళ్లించిన అనంతరం తిరిగి వాటిని తనకు సంబంధించిన వ్యక్తుల ఖాతాకు మళ్లించారని గ్రామస్థులు కార్యదర్శిపై కలెక్టరుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అందుకు సంబంధించి ఇన్‌చార్జ్ ఎంపీడీవో కృష్ణను సోమవారం ఆంధ్రజ్యోతి వివరణ కోరగా యనమదల పంచాయతీ కార్యదర్శిపై కలెక్టరుకు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనన్నారు. దీనిపై కలెక్టరు కార్యాలయం నుంచి తమకు గ్రామస్థులు చేసిన ఫిర్యాదు పత్రం వచ్చిందన్నారు.ఈ విషయమై విచారణ చేసేందుకు ఇంకా అధికారిని నియమించలేదన్నారు.

కారు ఢీకొని ఆటో బోల్తా

15 మంది కూలీలకు తీవ్ర గాయాలు

ఇరువురి పరిస్థితి విషమం

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే కొండయ్య

చినగంజాం(చీరాల), మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పొట్టకూటి కోసం కూలి పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో కారు రూపంలో ప్రమాదం ముంచుకొచ్చింది. చినగంజాం - రొంపేరు మధ్యలో ఆటోను ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడింది. 15 మంది కూలీలకు, కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. చీరాల మండల పరిధిలోని బోయినవారిపాలెంకు చెందిన బ్రహ్మేశ్వరి, శివ, పోలేరు, హేమలత, ఆదిలక్ష్మి, రమాదేవి మరో తొమ్మిది మంది రోజులాగే నాగులుప్పలపాడు సమీపంలోని ప్రాసంగులపాడు వద్ద మిర్చి కోతలకు ఆటోలో వెళ్లారు. సాయంత్రం వరకు పనులు చేసి తిరిగి ఆటోలో ఇంటికి వెళుతుండగా చినగంజాం - రొంపేరు మధ్యలోని రహదారిలో ఎదురుగా వస్తున్న కారు వేగంగా ఆటోను ఢీకొంది. దీంతో ఆటో ఎగిరి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న మహిళలు అందరూ తీవ్రంగా గాయపడ్డారు. వారందరూ చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అలాగే కారు డ్రైవర్ సమీర్, మరో వ్యక్తి షంషాద్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉంది. ఈక్రమంలో సమీర్‌ను ఒంగోలు రిమ్స్‌కు తరలించగా, షంషాద్ చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈమేరకు అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. గాయపడిన కూలీలు కూడా చీరాల ఏరియా వైద్యశాలలోనే చికిత్స పొందుతున్నారు.

మెరుగైన వైద్యం అందించండి -ఎమ్మెల్యే

ప్రమాద సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య హుటాహుటిన చీరాల ఏరియా వైద్యశాలకు చేరుకున్నారు. ప్రమాదం గురించి బంధువులతో మాట్లాడి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.



హాస్పిటల్ వార్డులో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య



తీవ్ర గాయాలతో కుప్పకూలిన బ్రహ్మేశ్వరి



అపస్మారక స్థితిలో షంషాద్



కలెక్టర్, జేసీల చేతుల మీదుగా ఉగాది ప్రభుత్వ పురస్కారాన్ని అందుకుంటున్న పద్యకళా కారుడు రామిశెట్టి వెంకటసుబ్బారావు

రామిశెట్టికి ఉగాది పురస్కారం

మార్టూరు,మార్చి31(ఆంధ్రజ్యోతి): మార్టూరు గ్రామానికి చెందిన రామిశెట్టి వెంకట సుబ్బారావు ఆదివారం బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వెంకట మురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌ల నుంచి ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. పౌరాణిక, పద్యకళాకారునిగా గుర్తింపుపొంది,భగవద్గీతను గానం చేస్తూ,సినీ రంగస్థల కళాకారునిగా సుబ్బారావు ప్రజల మన్ననలను పొందారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఆర్‌డీవో గ్లోరియా పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న వాసవి వనిత క్లబ్ సభ్యులు

రోగులకు పండ్లు, బ్రెడ్ల పంపిణీ

అద్దంకిటౌన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్లబ్ జోన్ ఛైర్మన్ వెంకట ఆదినారాయణ ఫ్రెండ్లీ విజిట్ సందర్భంగా అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు, పాలు, పిల్లలకు దుస్తులు, ఆహారం అందించినట్లు క్లబ్ ప్రెసిడెంట్ కె. లావణ్య, సెక్రటరీ ఎల్. పద్మావతిలు తెలిపారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



దివ్యాంగ పెన్షన్ అందుకునే సుభాషిణి తాతతో మాట్లాడుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

చినగంజాం, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం గ్రామంలో మంగళవారం పేదల సేవ పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన ఏర్పాట్లను మంత్రులు సోమవారం పరిశీలించారు. పింఛన్‌దారుల గృహాలను, సీఎం పూజలు నిర్వహించే కోదండరామాలయం, హెలిప్యాడ్, ప్రజావేదిక తదితర వాటిని సోమవారం సాయంత్రం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు, బాపట్ల, చీరాల శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు, వేగేశన నరేంద్రవర్మ, ఎంఎంకొండయ్యలతో కలిసి పరిశీలించారు. సీఎం పింఛన్ అందజేసే గృహాలకు వెళ్లి వారితో మాట్లాడారు. దివ్యాంగ పింఛన్ పొందే వడ్లమూడి సుభాషిణి ఇంటి వెళ్లి ఆమె తాత ఎల్లవుల వెంకటేశ్వర్లుతో మాట్లాడారు. గృహ నిర్మాణం, సుభాషిణి తల్లికి ఒంటరి మహిళ పింఛన్ అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ యువత భరోసా కోసం 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి సీఎం తగు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. అలాగే రాష్ట్రంలో ప్రతి నెలా 64లక్షల పెన్షన్లను ప్రతి నెలా 1వ తేదీ ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతతో పంపిణీచేస్తున్నారని అన్నారు. అలాగా రాష్ట్రంలో ప్రతి వ్యక్తి తలసరి ఆదాయం పెంచటానికి సీఎం చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు అప్పులు చేసినప్పటికీ తమ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎక్కడా ఆపకుండా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడీ, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

చీరాల అభివృద్ధికి సహకరించండి

చీరాల : నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉందని, అలాగే పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరగాల్సి ఉందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మంగళవారం పర్చూరు నియోజకవర్గంలోని చినగంజాంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి పర్యవేక్షణకు విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారధి, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మలను ఎమ్మెల్యే కొండయ్య నియోజకవర్గ క్యాంపు కార్యాలయానికి ఆహ్వానించారు. ఈక్రమంలో నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరారు.

నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన

పంగులూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి):విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం మండలంలోని భగవాన్‌రాజుపాలెం గ్రామంలో పింఛన్లు పంపిణీలో పాల్గొననున్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్



అద్దంకి పట్టణం శింగరకొండ రోడ్డులోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అద్దంకి,మార్చి31(ఆంధ్రజ్యోతి): ముస్లింలు అత్యంత పవిత్రంగా నిర్వహించుకునే రంజాన్ పండుగను సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నెల రోజుల పాటు ఉపవాసం ఉండి ఆదివారం రంజాన్‌ను జరుపుకున్నారు. అద్దంకి పట్టణంలోని శింగరకొండ రోడ్డు, టైలర్స్ కాలనీ, ఒంగోలు రోడ్డులోని రాజీవ్ కాలనీ తదితర ప్రాంతాలలోని ఈద్గా ల వద్ద ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని దేనువకొండలో ముస్లింలతో కలిసి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ నాగినేని రామకృష్ణ ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. మణికేశ్వరంలో ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా ఆధ్వర్యంలో 23 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. చిన్నారులు ప్రత్యేక ప్రార్థనలకు హాజరై ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

బల్లికురవ : మండలంలోని పలు గ్రామాలలో ముస్లింలు సోమవారం రంజాన్ పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని పలు గ్రామాలలో ఉన్న మసీదులకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి ప్రార్థనలు చేశారు.

పంగులూరు : రంజాన్ సందర్భంగా మండలంలోని అలవలపాడు, రామకూరు, పంగులూరు గ్రామాలలో ముస్లింలు వందల సంఖ్యలో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫిత్రా సమర్పించారు. ఒకరి కొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకుంటూ సందడి చేశారు.

మేదరమెట్ల : మేదరమెట్లలోని ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రతేక ప్రార్థనలో పాల్గొని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలువురు ముస్లింలు పేదలకు దానధర్మాలు చేశారు.

చీరాల : నియోజకవర్గ పరిధిలోని మసీదుల్లో సోమవారం రంజాన్ వేడుకలు జరిగాయి. స్థానిక సాల్మన్ సెంటర్, పేరాల మసీదుల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొని ప్రార్థనలు చేశారు. అనంతరం వారితో ముచ్చటించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మార్టూరు :మండలంలోని వలపర్ల, నాగరాజుపల్లి, బొబ్బేపల్లి తదితర గ్రామాలలో ముస్లింలు ఈద్గాల వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు. మసీదుల వద్ద దానధర్మాలు చేశారు

చినగంజాం : మండలంలోని చినగంజాం, కడవకుదురు గ్రామాల్లోని ముస్లింలు ర్యాలీగా ఈద్గా, మసీదుల వద్దకు వెళ్లి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా ముస్లింలకు హిందువులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఇంకొల్లు : స్థానిక ఈద్గా వద్దకు అధికసంఖ్యలో ముస్లింలు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పర్చూరులో

పర్చూరు: పర్చూరులోని ఇందిరా కాలనీ మసీదు, ఉప్పుటూరు, నూతలపాడు, నాగులపాలెం, చెరుకూరు, పోతుకట్ల తదితర గ్రామాల మసీదులు, ఈద్గాల వద్ద ప్రార్థనలు నిర్వహించారు. ముందుగా ర్యాలీగా బయలుదేరి స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలకు దాన ధర్మాలు చేశారు. అలాగే కారంచేడు మండలంలోని కారంచేడు, స్వర్ణ, కుంకలమర్రు, దగ్గుబాడు తదితర గ్రామాల్లో ముస్లింలు రంజాన్ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.

పేదలకు చీరల పంపిణీ

అద్దంకిటౌన్: రంజాన్ పండుగ సందర్భంగా వెంకటేశ్వర సప్లయర్స్ యజమాని షేక్ లాలు సాహెబ్ ఆధ్వర్యంలో పేదలకు చీరలను పంపిణీ చేశారు. సోమవారం స్థానిక జూనియర్ కళాశాల వెనుక ఉన్న తన నివాసం వద్ద ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఏటా మాదిరిగానే ఆయా కాలనీలలోని 250 మందికిపైగా పేద మహిళలకు చీరలు, స్వీట్లు పంపిణీ చేసినట్లు లాలు సాహెబ్ తెలిపారు. ఈకార్యక్రమంలో మస్తాన్ బీ, షేక్ చిన్న లాలు, హబీదా బేగం, జుబేర్, హైదర్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పాడి రైతులకు బోనస్‌పై హర్షం

బల్లికురవ. మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పాడి పరిశ్రమ వృద్ధికి పాలు పోస్తున్న రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ డెయిరీ బోనస్ ప్రకటించటం హర్షణీయం అని పలు గ్రామాలకు చెందిన డెయిరీ అధ్యక్షులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలోని కృష్ణా మిల్క్ డెయిరీలో సమావేశం జరిగింది. ఈసందర్భంగా వారు కృష్ణా యూనియన్ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల కేంద్రాల అధ్యక్షులు ఎస్. బాలకృష్ణ సుగుణ, వరప్రసాద్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన చికెన్ ధర



పర్చూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పండుగ పుణ్యమా అని చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. ఒక్క రోజులోనే 50 శాతం ధర పెరగటం చికెన్ ప్రియులను ఆవేదనకు గురిచేసింది. ఇటీవల బర్డ్‌ఫ్లూ వ్యాధి ప్రభావంతో చికెన్ ధరలు అనూహ్యంగా పడిపోయాయి. చివరకు కేజీ చికెన్ రూ.150లకు కూడా కొనేవారులేక దుకాణాలు వెల వెల బోయాయి. దీంతో వ్యాపారులు డీలాపడ్డారు. ఇటీవల ధరలు క్రమంగా పెరిగి రూ.180 నుంచి 200లకు చేరింది. ఉగాది రోజు ఉదయం కేజీ రూ.250 పలకగా సాయంత్రానికి రూ.300లకు చేరింది. రంజాన్ రోజూ అదే ధర కొనసాగింది. అలాగే మటన్ ధర రూ.1000కి చేరటంతో అధిక శాతం ప్రజలు చికెన్‌తోనే సరిపెట్టుకున్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

మార్టూరు,మార్చి31(ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై మినీలారీ ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన వి. గంగాధర్ (38) విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కానిస్టేబుల్ కోటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 23న ఈ ప్రమాదం జరిగిన విషయం పాఠకులకు విదితమే. మృతుడిది పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం. ఆస్పత్రినుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు కోటేశ్వరరావు తెలిపారు.

గ్రానైట్ ఫ్యాక్టరీ కార్మికుడి మృతి

బల్లికురవ. మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామ పరిధిలోని చందన గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికుడు జోగిందర్ మహంత(47) మద్యం సేవించి నిద్రలోనే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు ఒడిస్సాకు చెందిన జోగిందర్ మహంత గ్రానైట్ ఫ్యాక్టరీలో పనులకు నెల రోజుల క్రితం వచ్చాడు. రెండు రోజుల క్రితం ఫూటుగా మద్యం సేవించి తోటి కార్మికులతో నిద్రించాడు. శనివారం తెల్లవారిన తరువాత ఎంత సేపటికీ నిద్ర లేవక పోవటంతో తోటి కార్మికులు చూసి వైద్య శాలకు తరలించేలోపే మృతి చెందాడు. మృతుడి అన్న కుమారుడు నాని మహంత ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జీవీ చౌదరి సోమవారం కేసు నమోదు చేశారు.

అదనపు ఆదాయ వనరుగా నాటుకోళ్ల పెంపకం

మార్టూరు,మార్చి31(ఆంధ్రజ్యోతి):నాటుకోళ్ల పెంపకం చేస్తూ కుటుంబాలకు అదనపు ఆదాయం వచ్చేటట్లుగా మహిళలు వినియోగించుకోవాలని ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకటమోహనరావు అన్నారు. సోమవారం స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో 30 మంది పేద కుటుంబాలకు చెందిన మహిళలకు 30 నాటుకోళ్ల యూనిట్లను మోహనరావు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరెంజ్ ఎలిఫ్యాంట్ అనే అమెరికా సంస్థ ఆర్థిక సహకారంతో ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో నాటుకోళ్ల యూనిట్‌లను పంపిణీ చేశామన్నారు. శ్రీకారం సంస్థ కార్యదర్శి జాష్టి అనూరాధ మాట్లాడుతూ మహిళలలో పొదుపు చేసే గుణం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మద్దుమాల కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు,శానంపూడి లక్ష్మయ్య, షేక్ ఖాజాహుస్సేన్, ఎం.ఈశ్వరప్రసాద్, జాష్టి సాంబ శివరావు తదితరులు పాల్గొన్నారు.



నాటుకోళ్లను అందుకున్న మహిళలతో ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్

ప్రేమ, శాంతితో క్రైస్తవులు ముందుకు సాగాలి

చీరాల, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : క్రైస్తవులు ద్వేషాలు, పగలు వంటి వాటికి దూరంగా ఉండి ఇతరుల పట్ల శాంతి, కరుణ, సోదర భావంతో ముందుకు సాగాలని పలువురు మత బోధకులు అన్నారు. ఇటీవల పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై ఆందోళన వాతావరణం నెలకొనడంతో సోమవారం మరియమ్మపేట పునీత ఆంథోనీ ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో చీరాల నుంచి కారంచేడు లూర్దు మాత దేవాలయం వరకు ఐక్యత ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అందరూ శాంతితో ఉండాలని, మృతి తీరని ఆవేదనను కలిగించిందని వివరించారు. కార్యక్రమంలో మత బోధకులు జగన్, సందీప్, డేవిడ్, క్రైస్తవులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై నిగ్గుతేల్చాలి

అద్దంకిటౌన్ : పాస్టర్ ప్రవీణ్ మృతిపై నిజాలు నిగ్గు తేల్చాలని అద్దంకి నియోజకవర్గ పాస్టర్స్ యూనియన్ కోరింది. సోమవారం స్థానిక రామ్‌నగర్ నుంచి బంగ్లారోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వరకు శాంతియుత నిరసన ర్యాలీ చేశారు. అనంతరం మానవహారం నిర్వహించారు. పాస్టర్ ఆర్ భాస్కర్, ఏ. బర్నబాస్, కె. రామారావు, ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, ఆర్టీసీ ఎస్సీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కా కాంతారావు, బీఎస్పీ నాయకులు, పలు మండలాల పాస్టర్‌లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

పవిత్ర రంజాన్ పర్వదినాన్ని సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లావ్యాప్తంగా మసీదులు, ఈద్గాలలో ఉదయం నుంచే ఐదుపూటలా ప్రార్థనలు చేశారు. ఇందుకోసం అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేయగా, పోలీసులు భద్రత కల్పించారు. ఇక అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా పాల్గొని దువా చేసి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



నెల్లూరు : బారాషహీద్ దర్గాలో ముస్లింలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఇమామ్ సయ్యద్ అబూబకర్ అష్రఫి సాబిరి, చిత్రంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్ తదితరులు



సీతారామపురం ఈద్గాలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

5.5 లక్షల ఎకరాల్లో రెండో పంట!

- 'సోమశిల' కింద 3.50 లక్షల ఎకరాలు
- 'కండలేరు' పరిధిలో 2 లక్షల ఎకరాలు
- ప్రతిపాదనలు తయారు చేసిన అధికారులు
- పది రోజుల్లో ఐఏబీ నిర్వహణకు సన్నాహాలు

నెల్లూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్ల తర్వాత జిల్లాలో ఎడగారు సాగు పూర్తిస్థాయిలో జరగనుంది. గతేడాది పుష్కలంగా వర్షాలు కురవడం, ముందు జాగ్రత్తతో శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను రప్పించడంతో ఈదఫా సాగుకు ఢోకా లేకుండా పోయింది. గతేడాది ఎడగారు ఊసే లేకపోగా ఈ దఫా సాగుకు అవకాశమున్న నేపథ్యంలో రైతాంగం సంతోషిస్తోంది. ఏప్రిల్ రెండో వారం నుంచి రెండో పంటకు సంబంధించి నీటిని విడుదల చేసేందుకు అధికారులు ప్రాథమికంగా ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం సోమశిల, కండలేరు జలాశయాల్లో ఉన్న నీటి లభ్యత ఆధారంగా ఎడగారు దాదాపు ఐదున్నర లక్షల ఎకరాలకుపైగా సాగునీటి కేటాయింపులు జరపాలని ప్రతిపాదించారు. సోమశిలలో ప్రస్తుతం 53 టీఎంసీల నీరు ఉంది. డెడ్ స్టోరేజీ, ఇతర అవసరాలకు పోగా మిగిలే నీటితో సుమారు 3.50 లక్షల ఎకరాలకు నీరు అందించవచ్చని భావిస్తున్నారు. పెన్నా డెల్టా కింద ఉన్న మొత్తం ఆయకట్టుకు నీరు ఇచ్చేలా ప్రాథమి కంగా నిర్ణయించారు. అలానే కండలేరు జలాశయం కింద 49 టీఎంసీలు నిల్వ ఉండగా, డెడ్ స్టోరేజీ, తాగునీటి అవసరాలకు పోను మిగిలిన నీటితో సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు ఇచ్చేలా ప్రతిపాదిస్తున్నారు. దీనిని బట్టి చూస్తే ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో రానున్న ఎడగారు ఐదు లక్షల ఎకరా ల్లో కచ్చితంగా సాగు కానుందని స్పష్టమవుతోంది. సాధారణం గా ఒక టీఎంసీ నీటితో పది వేల ఎకరాలను పండించవచ్చు. అయితే వేసవి కాలం కావడంతో నీటి ఆవిరి ఎక్కువగా ఉంటుందన్న కారణంతో ఒక టీఎంసీతో 8500-9000 ఎకరాలు పండించేలా ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. ప్రాజెక్టుల కింద ఉన్న హక్కుల ప్రకారం ఏ కాలువ కింద ఎంత ఆయకట్టు మేర సాగుకు నీటి కేటాయింపులు జరపాలన్నదానిపై కసరత్తు చేస్తున్నారు. ఈ ప్రతిపాదనలన్నీ సాగునీటి సలహా మండలి(ఐఏబీ) ముందు ఉంచనున్నారు. ఐఏబీ నిర్వహణకు సంబంధించి ఇరిగేషన్ అధికారులు ఇప్పటికే మంత్రులు, కలెక్టర్ ఆనంద్‌తో చర్చించారు. మరో పది రోజుల్లోపు ఐఏబీ నిర్వహించాలని మంత్రులు ప్రాథమికంగా నిర్ణయించారు. ఎమ్మెల్యేలందరితో మాట్లాడాక వారి వీలునుబట్టి ఒక తేదీని నిర్ణయించి ఐఏబీ సమావేశాన్ని పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇప్పటికే వరి కోతలు 90 శాతం వరకూ పూర్తయ్యాయి. మరోవారంలో కోతలు పూర్తికానున్నాయి. దీంతో ఐఏబీ నిర్వహించిన వెంటనే రెండో పంటకు నీటి విడుదల మొదలుపెట్టేలా ఇరిగేషన్ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.



● ముగిసిన ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు

నెల్లూరు (హరనాథపురం) : జిల్లాలో 2024-25 ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లు సోమవారం అర్ధరాత్రి ముగిశాయి. మంగళవారం మధ్యాహ్నం 1 గంట తర్వాత రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతుందని జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, ఇప్పటిదాకా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 74వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం 3916 మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నట్లు ఆయన తెలిపారు.

'రంజాన్'లోనూ 111 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్!

నెల్లూరు (హరనాథపురం), మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ సందర్భంగా సోమవారం సెలవు దినమైనా జిల్లావ్యాప్తంగా 111 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ జరిగాయి. రిజిస్ట్రేషన్ శాఖకు రూ.42.73 లక్షల ఆదాయం వచ్చింది. నెల్లూరులోని ప్రధాన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 11 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు జరిగాయి.

గందరగోళంగా ఈకేవైసీ

- రేషన్‌కార్డుదారుల్లో అవగాహనారాహిత్యం
- చేయాల్సింది 2.4 లక్షలు.. చేసింది 1.4 లక్షలే
- చేతులెత్తేసిన పౌరసరఫరాల శాఖ
- ఈనెలాఖరు వరకే గడువు పొడిగింపు
- ఇప్పటికైనా అధికారుల్లో చలనం వచ్చేనా!?

నెల్లూరు (హరనాథపురం), మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రేషన్‌కార్డుదారుల ఈకేవైసీ ప్రక్రియ గందరగోళంగా మారింది. ఈకేవైసీ చేయించుకోవాలని కార్డుదారుల్లో అవగాహన కల్పించాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలో 2.4 లక్షల మంది ఈకేవైసీ



చేయించుకోని కార్డుదారులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరందరి చేత మార్చి నెలాఖరులోగా ఈకేవైసీ చేయించాల్సి ఉంది. గడువు ముగిసినా లక్ష్యాన్ని మాత్రం (1.4 లక్షల మందికి పూర్తి) అధికారులు పూర్తి చేయలేకపోయారు. రాష్ట్ర ప్రభుత్వం గడువు పొడిగించకుండా ఉంటే సుమారు లక్ష మందికిపైగా రేషన్ పొందే అవకాశాన్ని కోల్పోయి ఉండేవారు. పౌరసరఫరాల శాఖలో డీఎస్‌ఓ, ఏఎస్‌ఓ, సీఎస్డీటీలు తదితర అధికారులు ఉన్నారు. వీరంతా ప్రాంతాల వారీగా డీలర్లను అప్రమత్తం చేసి ఈకేవైసీ చేయించాలని ఒత్తిడి చేయలేకపోయారు. దీంతో లక్షలాది మంది కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోలేకపోయారు.

● సచివాలయాల్లో ఏదీ!?

రేషన్‌కార్డులో పేరు ఉండి ఐదేళ్లు దాటిన పిల్లలకు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలి. ఐదేళ్లు దాటినా పిల్లలకు బయోమెట్రిక్ పడకపోతే ఆధార్ సెంటర్‌లో అప్‌డేట్ చేయించుకోవాలి. అనంతరం డీలర్ లాగిన్‌లో ఈకేవైసీ చేయించాలి. సచివాలయాలు లేదా రేషన్ డీలర్ వద్ద ఈకేవైసీ చేయించుకోవచ్చని చెప్పిన అధికారులు, ఆ దిశగా వారు చేస్తున్నారో లేదో పరిశీలించలేదు. దీంతో సచివాలయానికి కార్డుదారులు వెళ్లినా సిబ్బంది, రేషన్ షాపులో డీలర్ అందుబాటులో ఉండకపోవడంతో చాలా మంది ఈకేవైసీ చేయించుకోలేకపోయారు. జిల్లాలో 7.35 లక్షల రేషన్ కార్డులు ఉండగా, ఒక కుటుంబంలో నలుగురికి తగ్గకుండా సభ్యులు ఉన్నారు. వీరందరి చేత గడువులోపు ఈకేవైసీ చేయించలేకపోయారు. అయితే, ప్రభుత్వం ఏప్రిల్ 30 వరకు పొడిగించడంతో కార్డుదారులకు ఊరట కలిగించినట్టు అయ్యింది. ఇప్పటికైనా పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించి రేషన్ కార్డులోని ప్రతి ఒక్కరు ఈకేవైసీ చేయించుకునేలా చర్యలు చేపట్టాలి.

'కాకాణి'కి మరో నోటీసు

- హైదరాబాద్‌కు వెళ్లిన నెల్లూరు పోలీసులు
- ఇంట్లో బంధువుకు అందజేసిన మనుబోలు ఎస్‌ఐ
- నేడు విచారణకు రావాలన్న పోలీసులు
- ముందస్తు బెయిల్‌పై నేడు విచారణ
- ఏం జరగబోతుందోనని వైసీపీ వర్గాల్లో ఉత్కంఠ



హైదరాబాద్‌లోని కాకాణి నివాసంలో ఆయన బంధువుకు నోటీసు ఇస్తున్న ఎస్‌ఐ రాకేష్

నెల్లూరు (క్రైం), మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో ఉంటున్న వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసానికి సోమవా రం జిల్లా పోలీసులు నోటీసులు అందజేశారు. 30వ తేదీన (ఆది వారం) నగరంలోని పొదలకూరు రోడ్డులో ఉన్న కాకాణి నివాసానికి వెళ్లిన పోలీసులు అక్కడ కాకాణి లేకపోవడంతో గోడకు నోటీసులు అంతికించిన సంగతి తెలిసిందే. క్వార్ట్జ్ కేసుకు సంబంధించి సోమవారం నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరుకావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. అయితే, సోమవారం మధ్యాహ్నం 12 గంటలు దాటినా కాకాణి విచారణకు హాజరు కాలేదు. ఇది ముందుగానే ఊహించిన జిల్లా పోలీసులు సోమవారం హైదరాబాద్‌లోని కాకాణి నివాసం వద్దకు చేరుకొని రెండవ నోటీసును అందజేసేందుకు ప్రయత్నించారు. అయితే ఆయన ఇంట్లో లేకపోవడంతో కాకాణి బంధువులు వేణుంబాక సుమంత్‌రెడ్డికి మనుబోలు ఎస్‌ఐ రాకేష్ నోటీసులు అందజేశారు. మంగళవారం ఉదయం రూరల్ డీఎస్పీ కార్యాలయంలో జరిగే విచారణకు రావాలని నోటీసులో పేర్కొన్నారు. రెండుసార్లు కాకాణి గోవర్ధన్‌రెడ్డి నోటీసులు తీసుకోకపోవడం, ముందస్తు బెయిల్‌పై నేడు విచారణ జరుగుతుండటం ఆసక్తిగా మారింది. ఈ నేపథ్యంలో మంగళవారం కాకాణి పోలీసుల విచారణకు హాజరవుతారా!? రెండుసార్లు నోటీసులు ఇచ్చినా తీసుకోక పోవడం, సమాధానం ఇవ్వకపోవడంతో పోలీసులు అరెస్ట్ చేస్తారా!? లేదా కోర్టు నుంచి ముందస్తు బెయిల్ వస్తుందా!? అన్నది వేచి చూడాలి. మరో వైపు క్వార్ట్జ్ కేసులో కాకాణి గోవర్ధన్‌రెడ్డి చుట్టూ ఉచ్చు బిగుసుకుంటుండటంతో వైసీపీ నాయకులు, కార్యకర్తల్లో కలవరం మొదలైంది.

నీలకంఠేశ్వరుడి మాన్యంలో మళ్లీ దొంగలు

● రాత్రుళ్లు యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు ● చూస్తూ ఉండిపోతున్న దేవదాయ శాఖ

ఉలవపాడు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం ఉలవపాడులోని నీలకంఠేశ్వర స్వామి ఆలయ భూముల్లో మళ్లీ గుట్టుచప్పుడుగా మైనింగ్ దోపిడీ జరుగుతోంది. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలంలోని శానంపూడి గ్రామం కొండుబీడులో సర్వే నెం.519లోని 30.05 ఎకరాల దేవుడి మాన్యం ఉంది. సదరు భూముల్లో సుమా రు 20 ఎకరాల్లో రూ.10 కోట్ల విలువైన గ్రావెల్ స్టోన్ కొల్లగొట్టినట్లు సమాచారం. గతేడాది జూలై లో దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఆగమేఘా ల మీద ఆలయ ఈవోలు జానకమ్మ, ప్రసాదులపై సస్పెన్షన్ వేటు వేశారు. దీంతో గ్రావెల్ స్టోన్ దోపిడీ ఆగినా కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి శానంపూడి గ్రామానికి చెంది న అధికార పార్టీ నాయకుడు ఆలయ భూముల్లో ఎర్రమట్టి, గ్రావెల్ విస్తృతంగా తవ్వుతున్నట్లు సమాచారం.

● ఉన్నతాధికారులకు ముడుపులు...

దేవుడి మాన్యంలో గ్రావెల్ దందా జరుగుతోందని, ఆలయానికి చెందాల్సిన ఆదాయం అక్రమార్కుల జేబుల్లోకి వెళుతోందని గతేడాది అప్పటి ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి రాష్ట్ర ఎండోమెంట్ మంత్రికి రాతపూర్వక ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి దేవదాయశాఖ ఏసీ, డీసీ ఉన్నతాధికారులు ఆలయ భూములను పరిశీలించి, చర్యలు తీసుకున్నారు. తిరిగి అదే దోపిడీ యథేచ్ఛగా గ్రావెల్ స్టోన్ అక్రమ రవాణా చేశాడంటే ఉన్నతాధికారులకు భారీగా ముడుపు ముట్టాయని అదే శాఖకు చెందిన వారే ఆరోపిస్తున్నారు. గ్రావెల్ దందా ముఠాకి ఉలవపాడు ఎండోమెం ట్ కార్యాలయంలో ఒక చిరుద్యోగికి సత్సంబం ధాలు ఉండటం, ఉన్నతాధికారులకు సదరు దోపిడీ ముఠా నుంచి భారీగా లంచాలు ఇప్పించారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో దిద్దు బాటు చర్యల్లో భాగంగా క్షేత్రస్థాయి లో ఈవోలను తాత్కాలికంగా విధు ల నుంచి తొలగిస్తూ ఉన్నతాధికా రులు చేతులు దులుపుకున్నట్లు ఎండోమెంట్ శాఖలో గుసగుసలు వినపడుతున్నాయి.

● దేవుడి మాన్యం ఆక్రమణ

నీలకంఠేశ్వర ఆలయానికి 70 ఎకరాల మాన్యం ఉంది. అయితే, దేవదాయ అధికారులకు ఆ భూ ములు హద్దులు ఇప్పటికి తెలియకపోవడంతో విచారం. వచ్చిన ప్రతి ఈవో తమ సొంత ఆదా య వనరులుగానే చూస్తున్నారే తప్ప ఆలయానికి ఆదాయం చేకూర్చుదామనే ఆలోచన లేకపోవడం గమనార్హం.

ధూపదీప నైవేద్యాలకు నిధులేవీ?

కోట్ల రూపాయల సంపదన ఇచ్చే మాన్యం భూములు ఉన్నా స్వామివారికి ధూపదీప నైవేద్యాలకు భక్తులు కానుకల మీదే ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఐదేళ్లుగా ఆలయం గోపురానికి కనీసం సున్నం కొట్టించిన దాఖాలు లేవు. ఇటీవల శివరాత్రి ఉత్సవాలు కూడా పూజారి అప్పుతెచ్చి జరిపించినట్లు మాట్లాడుకుంటున్నారు. శివాలయం దుస్థితికి కారకులపై గ్రామస్థులు, భక్తులు భగ్గుమంటున్నారు.

● పంథామార్చి దోపిడీ

ఈవోల సస్పెండ్ వేటుతో వెనుకకు తగ్గిన దోపి డీ ముఠా పంథా మార్చి దందా నిర్వహిస్తు న్నట్లు స్థానికులు మాట్లాడుకుంటున్నారు. ఆలయ భూము లకు ఆనుకొని వ్యాపారి లీజుకు తీసుకు న్న భూముల్లో గ్రావెల్ స్టోన్ గ్రేడింగ్ జరుగుతోం ది. అయితే రాత్రివేళ ఆలయ భూముల్లో ఎక్స్‌క వేటర్‌తో గ్రావెల్ తీసి పక్కనే ఉన్న తన క్వారీలో విలువైన రాళ్ల గ్రేడింగ్ చేసి వచ్చిన ఎర్రమట్టిని తిరిగి ఆలయ భూముల్లో దిబ్బలుగా పోస్తున్నా రు. కొండబీడులో రూ.కోట్లు విలువ చేసే గ్రావెల్ స్టోన్ అక్రమార్కు లకు అడ్డాగా మారినా దేవదాయ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఈవోల సస్పెన్షన్ తర్వాత విధుల్లోకి చేరిన అధికారులు కూడా ఈ భూములపై దృష్టి సారించకపోగా జరుగుతున్న దోపిడీ, అవినీతిని అరకట్టే ప్రయత్నం చేయడం లేదని గుసగుసలు వినబడుతున్నాయి.



నీలకంఠేశ్వర ఆలయం



ఆలయ భూముల్లో తవ్వకాలు జరిపి గ్రేడింగ్ అనంతరం పోసిన గులకరాళ్ల గుట్టలు

బోగోలులో ఆగని అక్రమాలు

రాత్రింబవళ్లు గ్రావెల్, ఇసుక తవ్వి, తరలింపు!

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం మారినా బోగోలు మండలంలో మాత్రం గ్రావెల్ అక్రమ తవ్వకాలు మాత్రం ఆగడం లేదు. వైసీపీ హయాంలో తిప్ప, అల్లిమడుగు సంఘం, గంగతిప్ప తదితర ప్రాంతాల్లో రాత్రింబవళ్ల గ్రావెల్, తువ్వఇసుక తవ్వి ఇతర ప్రాంతాల్లో అమ్మి సొమ్ము చేసుకునేవారు. 2023, సెప్టెంబరులో కొందరు భారీ యంత్రాలతో గ్రావెల్ తవ్వకాలు జరుపుతుంటే బాడన్‌పేట, అల్లిమడుగు సంఘం గ్రామస్థులు అడ్డుకున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఆ తర్వాత 2024, నవంబరు 18న బాడన్‌పేట గ్రామ శివారులో గ్రావెల్‌ను తవ్వుతుండగా టీడీపీ నాయకులు అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే, పోలీసుల కళ్ళుగప్పి టిప్పర్, ఎక్స్‌కవేటర్‌తో దుండగులు ఉడాయించారు. దొరికిన నంబరు లేని టిప్పర్‌పై ఎస్సై భోజ్యా కేసు నమోదు చేసి మైనింగ్ అధికారులకు అప్పగించారు. అయితే అక్రమ గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్న విషయంలో దివ్యాంగుడు రవిపై గ్రావెల్ మాఫియా దాడి చేశారన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేసులు నమోదు చేసినా గ్రావెల్ తవ్వకా లు మాత్రం ఆగడం లేదు. వైసీపీ ప్రభుత్వం పోయి టీడీపీ పాలన వచ్చి 9 నెలలు గడుస్తున్నా మాఫియా మాత్రం చెలరేగిపోతోంది. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు గ్రావెల్ కోసం తవ్వకాలు చేస్తున్నారు. తిప్ప, బాడన్‌పేట, కడనూతల, తాళ్ళూరు తదితర గ్రామాల్లో సేక రించిన గ్రావెల్‌ను కావలి రూరల్, రాజుపాలెం, పడుగుపాడు తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు.



పోలీసుల అదుపులో ఉన్న టిప్పర్లు (ఫైల్)

కేసులు నమోదు చేస్తున్నాం

బోగోలు మండల పరిధిలో అక్రమ గ్రావెల్ తరలిస్తున్నట్లు సమాచారం అందితే వెంటనే దాడులు చేస్తున్నాం. అక్రమా ర్కులపై కేసులు కూడా పెడుతున్నాము. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మైనింగ్ అధికారులకు కేసులు అప్పగించి చర్యలు చర్యలు తీసుకుంటున్నాము.

- భోజ్యా, ఎస్‌ఐ బోగోలు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	142
స్కిన్ చికెన్	256
స్కిన్‌లెస్	282
కోడిగుడ్ల ధర (100)	520

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8704
వెండి కిలో ధర	రూ. 103000
వెండి ఒక గ్రాము	రూ.106.00

చలివేంద్రం ప్రారంభం

కందుకూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దబజారులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద బోణాల చెంచుక్రిష్ణయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్రీనివాసచక్రవర్తి, కుటుంబసభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పట్టణ సీఐ వెంకటేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో చక్కా వెంకటకేశవరావు, కొత్తూరి సుధాకర్, మురారిశెట్టి సుధీర్ కుమార్, ఇస్కాల సురేంద్ర, కంకణాల వెంకటేశ్వర్లు, తాతా లక్ష్మణ, చీదెళ్ల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అందరిపై అల్లా కరుణ ఉండాలి

● కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ● భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు ● ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు



కావలి : మదీనా మసీదు ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కావలి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రేమ, కరుణ, ఐకమత్యం, సేవాతత్పరత, ఆధ్యాత్మికత వెల్లివిరిసే రంజాన్ పర్వదినం సందర్భంగా అందరిపై అల్లా కరుణ, కటాక్షాలు ఉండాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆకాంక్షించారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని వైకుంఠపురం మదీనా మసీదు, రైల్వేరోడ్డులోని జామియా మసీదులో జరిగిన ప్రార్థనలలో ఆయన పాల్గొని ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేసి అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కాగా కావలిలో ముస్లింలు రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు పట్టణం లోని వివిధ మసీద్‌లు, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రైల్వే రోడ్డులోని జామియా మసీద్‌లో ముఫ్తీ రషీద్ మౌలానా ప్రార్థనలు జరిపించారు. వైకుంఠపురంలోని మదీ నా మసీద్ ఈద్గాలో ముఫ్తీ ఖలీల్ అహ్మద్ ప్రార్థనలు చేయించారు. మసీదులు, ఈద్గాలలో ప్రవక్తలు రంజాన్ పండుగ ఆవశ్యకతను ముస్లింలకు వివరించారు. ప్రార్థనల అనంతరం ఈద్‌ముబారక్ తెలుపుకుంటూ ఒకరినొకరు అలింగనం చేసుకున్నారు.



ఆత్మకూరు పెద్ద మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

● ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా

రంజాన్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని 34 వ వార్డులో సోమవారం ముస్లిం కుటుంబాలకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయన సతీమణి మలిశెట్టి విజయలక్ష్మిలు సొంత నిధులతో రంజాన్‌తోఫా అందచేశారు. ఈ కార్యక్రమంలో 34వ వార్డు టీడీపీ అధ్యక్షుడు సూరిశెట్టి రామక్రిష్ణ, ప్రధాన కార్యదర్శి సుందర శ్రీనివాస్ నేతలు పట్నం శివ, సునీత తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

● **కందుకూరు** : రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని పెద్దమజీద్, సంతోష్‌నగర్, జామియా మజీద్, విక్కిరాల పేట రోడ్డు, సుందరయ్య నగర్, జనార్థనకాలనీ తదితర ప్రాంతాలలో వేలాదిమంది ముస్లింలు సామూహిక ప్రార్థనల్లో పాల్గొని ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనాలతో పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకుంటూ సందడి చేశారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పట్టణ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు షేక్ సలాం ఇంటివద్ద అల్పాహార విందుకు హాజరయ్యారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు కూడా అల్పాహారం విందులో పాల్గొన్నారు. పలువురు బంధువులు, స్నేహితులను తమ నివాసాలకు విందులకు ఆహ్వానించగా మరికొందరు విందు భోజనాలను వారి నివాసాలకు పంపించారు.

● **అల్లూరు** : పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా అల్లూరులోని జామియా మసీదు, బీసీ కాలనీలోని మసీదుతోపాటు నార్తు మోపూరు, ఇస్కపల్లిల్లోని మసీదుల్లో ముస్లింలు నమాజులు చేశారు. మతపెద్దలు రంజాన్ పవిత్ర మాసం గురించి వివరించారు.

● **లింగసముద్రం** : రంజాన్ పండుగ సందర్భంగా లింగసముద్రంలోని ముస్లింలు జంగంరెడ్డిపాలెంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే పెదపవనిలోని మసీదులో మత గురువుకు స్థానిక టీడీపీ నేత షేక్ హిదాయతుల్లా, పలువురు ముస్లింలు స్వీట్లు తినిపించారు. చిన పవని, ఆర్ఆర్ పాలెం, మొగిలిచెర్ల, మేదరమెట్లపాలెం గ్రామాల్లోని ముస్లింలు ఆయా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● **ఉలవపాడు** : రంజాన్ వేడుకలు మండలంలో ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల పాటు కఠోర దీక్షలతో ఉపవాసాలు చేపట్టిన ముస్లింలు సోమవారం ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలతో దీక్షలను ముగించారు. చిన్నా పెద్ద తేడాలేకుండా ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. ఉలవపాడులోని ఈద్గా వద్ద ముస్లిం మతపెద్ద ప్రత్యేక ప్రార్థనలు, బోధనలు నిర్వహించారు.

● ముస్లింలకు పండుగ సరుకులు అందజేత

పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలని కరేడువాసి, వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి సోమవారం ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందచేశారు. రంజాన్ పండుగకు అవసరమైన వస్తువులు, మాంసం, సరుకులు అందచేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పందలపు సుందరమ్మ, మాజీ సర్పంచు కృష్ణారావు, వైసీపీ నాయకులు షేక్ వలి, ఖాజా, రామనాథం, రామకృష్ణ, మాల్యాద్రి, జాలయ్య తదితరులు పాల్గొన్నారు.

● **కొండాపురం** : సాయిపేట, నేకునాంపేట, కొమ్మి, గుడవళ్లూరు, గరిమెనపెంట, తూర్పు ఎర్రబల్లి తదితర గ్రామాల్లో మసీదుల వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. పండుగను పురస్కరించుకొని జకాత్, ఫిత్రా పేరుతో పేదలకు దానధర్మాలు చేశారు.

● **కలిగిరి** : మండలంలోని మసీదుల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్నేహితులు, బంధుమిత్రులకు పలువురు ముస్లింలు విందుభోజనాలు ఏర్పాటు చేశారు. హిందువులు ముస్లింలకు ఈద్‌ముబారక్ తెలియజేశారు.



కావలి : పట్టణంలోని జామియా మసీదులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి



లింగసముద్రం : జంగంరెడ్డిపాలెం ఈద్గాలో...



ఉలవపాడు : ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కొండాపురం : సాయిపేటలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



బిట్రగుంట : రంజాన్ విశిష్టతను వివరిస్తున్న ఇమామ్‌సాబ్

● **బిట్రగుంట** : బోగోలు మండలంలో ముస్లింలు ఈద్గా ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చెంచులక్ష్మీపురం ఈద్గా వద్ద ఇమామ్‌సాబ్ సోయబ్ అత్తర్ రంజాన్ విశిష్టతను వివరించారు, విశ్వనాథరావుపేటలోని ఇబ్రహీం పేట, నాగులవరం, పాతబిట్రగుంట ఈద్గాల వద్ద రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

● ముస్లింలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరి : ముస్లింలకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. మండలంలో ముస్లింలు రంజాన్ వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకు న్నారు. స్థానిక ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేప ట్టారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్, టీడీపీ నా యకులు ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈద్గా మైదానం చుట్టూ ప్రహరీ నిర్మాణంతోపాటు తాగునీటి సౌకర్యం ఏర్పాటుకు చర్యలు చేపడతానన్నారు. ఉదయగిరి పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మం డల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు రియాజ్, టీడీపీ నాయకులు గడ్డం వెంక టేశ్వర్లు, నల్లిపోగు రాజా, సందానీ, రంతుజాని, శ్రీకుర్తి రవీంద్రబాబు, తుమ్మల కిరణ్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● **దుత్తలూరు:** మండలంలోని నందిపాడు, వెంకటంపేట, నర్రవాడ, ఏరుకొల్లు తదితర గ్రామాల్లో ముస్లింలు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లోని ఈద్గా మైదానాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

వరికుంటపాడు(ఉదయగిరిరూరల్): రంజాన్ సందర్భంగా మండలంలోని తోటల చెరువుపల్లి, కొత్తపల్లి, విరువూరు, తిమ్మారెడ్డిపల్లి, హుస్సేన్‌నగర్, రామాపురం, వరికుంటపాడు, జడదేవి, తూర్పుబోయమడగల తదితర గ్రామాల్లోని ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహిళలు సైతం నివాసాల్లోనే ప్రార్థనలు చేపట్టారు. అనంతరం కులమతాలకతీతంగా విందు భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు.

● **సంగం** : మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లింలు రంజాన్ పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల ఈద్గా మసీద్‌లల్లో ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు వస్త్ర, ధన, అన్నదానాలు నిర్వహించారు. సంగం, దువ్వూరు, సిద్దీపురం, జండాదిబ్బ, తలుపూరుపాడు, మర్రిపాడు తదితర ప్రాంతాల ఈద్గాలలో ప్రార్థనలు చేసి ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.

● **అనంతసాగరం:** మండలంలోని సోమశిల, ముస్తాపు రం అనంతసాగరం, ఉప్పలపాడు, గౌరవరం, కచ్చేరిదేవరా యపల్లి, పీకేపాడు, పాతదేవరాయపల్లి, ఆమనిచిరివేళ్ల గ్రామాల్లో సోమవారం ఘనంగా రంజాన్ వేడుకలు నిర్వహిం చారు. ముస్లీంలు ఈద్గా ప్రాంగణాలకు చేరుకొని ప్రత్యేక నమాజులో పాల్గొన్నారు.

● **ఏఎస్ పేట:** మండలంలోని ఏఎస్‌పేట, హసనపురం, చిరమన, రాజవోలు, గుంపార్లపాడు, గుడిపాడు, అనుమసముద్రం తదితర గ్రామాలలో సోమవారం రంజాన్ పండుగను ముస్లీంలు ఘనంగా నిర్వహించారు. ఏఎస్ పేటలోని నాయబ్‌రసూల్ దర్గా మసీదులో అత్యధికంగా ముస్లీంలు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. దర్గా ఈవో షేక్ మహ్మద్ హుస్సేన్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నమాజ్ అనంతరం పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు.



వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

● **సీతారామపురం:** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో ముస్లింలు ఈద్గాల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గాన్ని అనుసరించాలని సూచించారు.



సంగం : ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

● **వింజమూరు** : రంజాన్ సందర్భంగా పట్టణం, మండలంలోని గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పేదలకు దానధర్మాలు చేశారు.

● **ఆత్మకూరు** : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు పెద్ద మసీదులో ముస్లీం మత పెద్ద ఇమామ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పేదలకు దాన ధర్మాలు చేశారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాల్లో ముస్లీంలు ఈద్గా, మసీదులలో ప్రార్థనలు చేసి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.



కావలి పట్టణంలోని మసీదు వద్ద రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ముస్లింల నిరసన



అనంతసాగరం : నిరసన ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

ఉదయగిరి, మార్చి 31 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని బిజ్జం పల్లి గ్రామంలో సోమవారం ఆవాజ్ కమి టీ ఆధ్వర్యంలో ముస్లింలు నూత నంగా అమలుచేసిన వక్ఫ్‌బోర్డు చట్ట సవరణలకు వ్యతిరేకంగా నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈద్గా మైదానంలో రంజాన్ ప్రత్యేక ప్రార్థనల అనంతరం వారు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, ఇమామ్‌లు, మౌజన్‌లు తదితరులు పాల్గొన్నారు.

● **అనంతసాగరం :** వక్ఫ్‌బోర్డు చట్ట సవరణలకు వ్యతిరేకంగా స్థానిక ముస్లీంలు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ చేశారు. సవరణ బిల్లు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

● **ఏఎస్ పేట :** నూతన వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం స్థానిక దర్గా సెంటర్‌లో ముస్లింలు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లీంలు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

దుత్తలూరు (ఉదయగిరి), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపాడు దేవరబోడుపై ఉన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజైన సోమవారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వేదికపై స్వామి, అమ్మవార్లను ఉంచి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణతంతు నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి గ్రామంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో పొంగళ్లు పొంగించి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కావలి రెడ్‌క్రాస్ చైర్మన్‌కు ఉగాది పురస్కారం



రవిప్రకాష్‌ను సత్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ మన్మథరావు తదితరులు

కావలి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కావలి శాఖ చైర్మన్ దాకారపు రవిప్రకాష్‌కు దీపం ఉగాది పురస్కారం దక్కింది. విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞానకేంద్రంలో ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, జీఆర్కే-పోలవరపు సాంస్కృతి సమితి, అంతర్జాల తెలుగు మాసపత్రికల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి దీపం ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో సామాజిక సేవా విభాగంలో రవిప్రకాష్‌కు ఆంధ్రప్రదేశ్ సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తి డాక్టర్ కే.మన్మథరావు, మాజీ పార్లమెంట్ సభ్యుడు గోకరాజు గంగరాజు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణలు ఈ పురస్కారం అందచేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కొంపల్లి సుందర్, తమ్మా శ్రీనివాసులరెడ్డి, గోళ్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి అంగన్‌వాడీ, ప్రీస్కూల్ ఏర్పాటు

● ఎస్సీ కాలనీవాసులకు అధికారుల హామీ



కాలనీలో చిన్నారులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ నిర్మలాదేవి, డిప్యూటీ డీఈవో జానకిరామ్

సంగం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దేవదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో సంగం పాత చెక్‌పోస్టు ఎస్సీ కాలనీలో సోమవారం ఐసీడీయస్ పీడీ నిర్మలాదేవి, ఆత్మకూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి జానకీరామ్ పర్యటించారు. శనివారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఎస్సీ కాలనీవాసులు కలిసి తమ కాలనీలోనే అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో స్పందించిన మంత్రి ఆదేశాల మేరకు ఐసీడీయస్ పీడీ నిర్మలాదేవి, ఉప విద్యాశాఖాధికారి జానకీరామ్ ఎస్సీ కాలనీవాసులను కలిసి అంగన్‌వాడీ కేంద్రం, 1, 2 తరగతులు నిర్వహించే ప్రీస్కూల్ ఏర్పాటుకు ఎంతమంది పిల్లలు ఉన్నారని ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎస్సీ కాలనీలోనే అంగన్‌వాడీ కేంద్రంతోపాటు, ప్రీస్కూల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో కాలనీవాసులు మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఐసీడీయస్ సూపర్‌వైజర్లు, విద్యాశాఖాధికారి మల్లయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, కాలనీవాసులు ఉన్నారు.

ఘనంగా పరుశురామ ఆలయ వార్షికోత్సవం



వార్షిక వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల దంపతులు

వింజమూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండెమడకలలోని పరుశురామ ఆలయ మొదటి వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, సతీమణి ప్రవీణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి కాకర్లను ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండెమడగల గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

అనంతసాగరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీఅగ్రహారం బస్టాండ్‌లో సోమవారం వైసీపీ నాయకులు అక్కులరెడ్డి భాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీ టీసీ కొండారెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగార్జున పాల్గొన్నారు.

పైడేరు బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమి పూజ



భూమిపూజ చేస్తున్న టీడీపీ నేత పమిడి

దగదర్తి(బిట్రగుంట), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలంలోని తురిమెర్ల వద్ద ఉన్న పైడేరు బ్రిడ్జి నిర్మాణ పనులకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి సోమవారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతు దగదర్తి రైతుల సాగునీటి సమస్యలను దృష్టిలో పెట్టుకుని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి రూ.3 కోట్ల మంజూరు చేయించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నీటిసంఘం అధ్యక్షుడు అల్లం రాధాయ్య, ప్రతాప్, చెన్నూరు నీటి సంఘం అధ్యక్షుడు పాపన మల్లికార్జునరెడ్డి, చల్లా శ్రీహరి, ఎం.వెంకటేశ్వర్లు, పీ.సుధాకర్, గోపాలచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరులో సమస్యలపై మాలేపాటి ఆరా



గ్రామస్థులతో మాట్లాడుతున్న మాలేపాటి

దగదర్తి(బిట్రగుంట), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం చెన్నూరులో సమస్యలపై ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు ఆరా తీశారు. ఈ మేరకు సోమవారం గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో కొందరికి పింఛన్, ఆరోగ్యశ్రీ, రేషన్‌కార్డులు మంజూరు కాలేదని టీడీపీ మహిళా నేత పందల రమణమ్మ, నిజాం అంకబాబులు తెలిపారు. గ్రామంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, చాలా మందికి పక్కాగృహాలు మజూరు చేయించాలని కోరారు. టీడీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని అందుకు మాలేపాటి కుటుంబం సహాయసహకారాలు ఉంటాయని రవీంద్ర నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు మాలేపాటి సుధాకర్ నాయుడు, స్థానిక నాయకులు సీహెచ్.శీనయ్య, ఎం.కృష్ణయ్య, ఏ.రమణ య్య, జీ.రమేష్, సార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై నిరసన ర్యాలీ



కలువాయి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై న్యాయ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సోమవారం కలువాయిలో నెల్లూరు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ కలువాయి కమిటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధులలో గుండా సాగిన ర్యాలీలో పాస్టర్లు, క్రైస్తవ సంఘాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, ప్రవీణ్ పగడాల కేసులో వెంటనే న్యాయం జరగాలని డిమాండ్ చేశారు.

నేడు సిద్దీపురంలో ఆర్‌డీఎస్ఎస్ పనులు

సంగం : సిద్దీపురం విద్యుత్ ఉప కేంద్రంలో మంగళవారం ఆర్‌డిఎస్ఎస్ పనులు చేస్తున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ మన్మధరావు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ మోటార్ల మాదిరిగానే గృహాలకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేసేందుకు నూతనంగా బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈకారణంగా సిద్దీపురం, మక్తాపురం, దువ్వూరు, వెంగారెడ్డిపాళెం ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుంది.